thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

ఫిఫా ఫైనల్ టికెట్‌కు రూ. 27 లక్షలు



11

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 111 | జగిత్యాల | ఆదివారం 19 జూలై, 20266 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## ఆస్పత్రికి వాంగ్‌చుక్ తరలింపు



- హైకోర్టు ఆదేశాలతో పోలీసుల నిర్ణయం
- 21 రోజుల దీక్షతో క్షీణించిన ఆరోగ్యం
- సఫ్దర్ జంగ్ ఆస్పత్రికి తరలించి చికిత్స
- దీప్కే నిరవధిక దీక్ష ప్రారంభం

4

## శిశువుల కిడ్నాప్ ముఠా ఆటకట్టు



- నెలరోజుల పసికందును అమ్మేందుకు యత్నం
- వలపన్ని పట్టుకున్న పోలీసులు

2

## బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు



- ఎనిమిది మంది దుర్మరణం..
- 15 మందికి తీవ్ర గాయాలు
- అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్న ఫ్యాక్టరీ
- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రధాని మోదీ

4



- ప్రజల ప్రాణాలతో చెలగామడితే చర్యలు
- ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం
- ప్రపంచ దేశాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం
- సేంద్రియ ఉత్పత్తుల పేరుతో విచ్చలవిడిగా అమ్మకాలు
- వాటి స్వచ్ఛతపైనా ఇకనుంచి పరిశీలన
- అసెంబ్లీలో చర్చించి సమగ్ర చట్టం రూపకల్పన

ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం

# ఆహార కల్తీపై ఉక్కుపాదం

## కల్తీదారులపై కఠిన చట్టం తీసుకొస్తాం



రాష్ట్రంలో ఆహార పదార్థాలు, ఔషధాల కల్తీని పూర్తిగా అరికట్టేందుకు ప్రభుత్వం అత్యంత పటిష్టమైన, కఠినమైన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ కల్తీలకు పాల్పడే వారిపై ఇకనుంచి ఉక్కుపాదం మోపాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఆహార, ఔషధ కల్తీ నియంత్రణపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్తీల నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

*- హైదరాబాద్, జూలై 18*

- వేల ఎకరాల్లో ఫామ్‌హౌజ్‌లతో కులకుతున్న నేతలు
- నేనున్నంత వరకు బిఆర్ఎస్ అధికారంలోకి రావడం కల్ల
- నిరుద్యోగులను మోసం చేసిన ఘనులు బీఆర్ఎస్ నేతలు
- అందెశ్రీ స్మృతివనం శంకుస్థాపనలో సీఎం రేవంత్

## నేనున్నంత వరకు బీఆర్ఎస్‌ను అధికారంలోకి రానివ్వను

- దొరల గడీల ముందు మోకరిల్లని కవి అందెశ్రీ
- అందెశ్రీని, గద్దర్‌ను అవమానించిన కేసీఆర్

భారత అంతరిక్ష రంగంలో

# కొత్త అధ్యాయం

## ‘విక్రమ్-1’ తొలి ప్రయోగం విజయవంతం

- దేశ తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్‌తో చరిత్ర సృష్టించిన స్కైరూట్
- 35 నిమిషాల ఆలస్యానంతరం నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్
- 450 కిలోమీటర్ల కక్ష్యలో ఆరు పేలోడ్ల విజయవంత ప్రవేశం
- స్కైరూట్ బృందానికి ప్రధాని మోదీ సహా పలువురి అభినందనలు

4



భారత అంతరిక్ష రంగంలో చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు అంతరిక్ష సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ రూపొందించిన ‘విక్రమ్-1’ రాకెట్ తొలి ప్రయోగంలోనే విజయవంతమైంది. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి శనివారం మధ్యాహ్నం 12.05 గంటలకు నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్, ఆరు పేలోడ్లను సుమారు 450 కిలోమీటర్ల ఎత్తులోని భూ దిగువ కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టింది. దీంతో ప్రైవేటు సంస్థ అభివృద్ధి చేసిన రాకెట్ ద్వారా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపిన దేశాల సరసన భారత్ నిలిచింది.

*- శ్రీహరికోట, జూలై 18*

## ఫాల్కన్ గ్రూప్ సీఎండీ అమర్‌దీప్ అరెస్ట్

- 14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు..చర్లపల్లికి తరలింపు

2

ఫాల్కన్ గ్రూప్ మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఫాల్కన్ సీఎండీ అమర్‌దీప్ కుమార్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్ చేశారు. ఢిల్లీలోని తీహార్ జైలు నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చి అమర్‌దీప్ అరెస్ట్‌ను చూపించారు అధికారులు.





స్కూల్ విద్యార్థినులకు

## వేధింపులు

- కాంట్రాక్ట్ టీచర్ల తొలగింపు

బాన్సువాడ మండలం కొత్తబాది మోడల్ స్కూల్‌లో విద్యార్థినులపై వేధింపులు కలకలం రేపాయి. ఆ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు కాంట్రాక్టు ఉపాధ్యాయులు తమతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని బాలికలు ఆరోపించడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

2

# లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది

- జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏవీ
- కొలువుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళా
- ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయి
- తెలంగాణలో లూటీ జరుగుతోంది
- మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోంది
- చాయ్ పే చర్చాను మరచిన రాహుల్
- బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ ఘాటు విమర్శలు

3

ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తప్పారని కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీకి తెలుగు రాదు.. మన బాధ తెల్వదు అని అన్నారు. అశోక్‌నగర్‌లో చాయ్‌పే చర్చా పెట్టింది అసలు రాహుల్‌గాంధీకి గుర్తుందా అని ప్రశ్నించారు. యువత తలరాత మారుస్తానని అబద్ధపు హామీలు ఇచ్చారని.. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీశారు. డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయి? విద్యా భరోసా ఏమైందని అడిగారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయని.. తెలంగాణలో లూటీ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోందని ఆరోపించారు.





## బీజేపీ నేతల్లో విభేదాలు లేవు

2

- అందరం కలసి అధికారం కోసం కృషి చేస్తున్నాం
- బండి సంజయ్, ఈటెల మధ్య సయోధ్యకు యత్నం
- తెలంగాణలో అధికారం బీజేపీదేనన్న ఎంపీ లక్ష్మణ్

తెలంగాణ భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవని, అందరం కలసి అధికారం కోసం కృషి చేస్తున్నామని బిజెపి ఎంపి లక్ష్మణ్ అన్నారు. బండి సంజయ్, ఈటెల రాజేందర్ మధ్య ఉన్న విభేదాలపై ఆయన స్పందించారు. కీలక నేతల మధ్య విభేదాలపై అధిష్ఠానం దృష్టి సారించింది. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ తో ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్ భేటీ అయ్యారు.



## శిశువుల కిడ్నాప్ ముఠా ఆటకట్టు

### నెలరోజుల పసికందును అమ్మేందుకు యత్నం

### వలపన్ని పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్, జూలై 18 :** గత కొంతకాలంగా శిశువులను అక్రమంగా రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును సైబరాబాద్ పోలీసులు రట్టుచేశారు. నెల రోజుల పసికందును కిడ్నాప్ చేసి విక్రయించేందుకు ప్రయత్నించిన ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి, శిశువును సురక్షితంగా తల్లి ఒడికి చేర్చారు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తల్లి ఒడిలో నుంచి నెల రోజుల పసికందును కిడ్నాప్ చేసిన ఘటన కలకలం రేపగా, పోలీసులు కేవలం ఒకే రోజులో పసిపాపను సురక్షితంగా రక్షించారు. ఈ కేసులో హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు, పాపను పశ్చిమ బెంగాల్‌కు తరలించి విక్రయించేందుకు కుట్ర పన్నినట్లు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా నిందితులు రూ. 1.50 లక్షలకు పసిపాపను అమ్మేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు, ఆన్‌లైన్ ద్వారా ముందస్తు నగదు కూడా స్వీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న చందానగర్ పోలీసులు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల సహాయంతో వికారాబాద్, హైదరాబాద్, కోల్‌కతా ప్రాంతాల్లో నిందితుల కదలికలను గుర్తించి అరెస్ట్ చేశారు. దీంతో అంతర్రాష్ట్ర శిశు అక్రమ రవాణా ముఠా కార్యకలాపాలు వెలుగులోకి వచ్చాయి. అనంతరం రక్షించిన పసిపాపను సురక్షితంగా కన్నతల్లికి అప్పగించారు. ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించి శిశువును కాపాడిన చందానగర్ పోలీసులు, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌కు మరోసారి ప్రశంసలు తీసుకొచ్చారు. పోలీసులు ఈ ముఠాకు మరిన్ని రాష్ట్రాలతో సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

## స్కూల్ విద్యార్థినులకు వేధింపులు

### కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల తొలగింపు

**కామారెడ్డి, జూలై 18 :** బాన్సువాడ మండలం కొత్తబాది మోడల్ స్కూల్‌లో విద్యార్థినులపై వేధింపులు కలకలం రేపాయి. ఆ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు కాంట్రాక్టు ఉపాధ్యాయులు తమతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని పలువురు బాలికలు ఆరోపించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. విద్యార్థినిల ఫిర్యాదును తీవ్రంగా పరిగణించిన విద్యాశాఖ అధికారులు వెంటనే పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. బాలికలు, పాఠశాల సిబ్బంది నుంచి వివరాలు సేకరించి నివేదిక రూపొందించారు. ప్రాథమిక విచారణలో ఆరోపణలకు తగిన ఆధారాలు ఉన్నట్లు గుర్తించిన అధికారులు తదుపరి చర్యలకు ఉపక్రమించారు. ఈ మేరకు కాంట్రాక్టు ఉపాధ్యాయులు గోపాల్, పవన్‌ను విధుల నుంచి తొలగించారు. విషయం విద్యార్థుల తల్లిదండ్రుల దృష్టికి వెళ్లడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో తమ పిల్లల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణ కొనసాగుతోందని, దర్యాప్తులో మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

## ఫాల్కన్ గ్రూప్ సీఎండీ అమర్‌దీప్‌ను అరెస్ట్ చేసిన ఈడీ

### 14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు..చర్లపల్లికి తరలింపు

**హైదరాబాద్, జూలై 18:** ఫాల్కన్ గ్రూప్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఫాల్కన్ సీఎండీ అమర్‌దీప్ కుమార్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్ చేశారు. ఢిల్లీలోని తీహార్ జైలు నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చి అమర్‌దీప్ అరెస్ట్‌ను చూపించారు అధికారులు. అనంతరం ఫాల్కన్ సీఎండీని న్యాయస్థానంలో హాజరుపరచగా.. కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో అధికారులు అమర్‌దీప్‌ను చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు. ఫాల్కన్ సంస్థ.. పెట్టుబడిదారులకు 11 శాతం నుంచి 21 శాతం వరకు అధిక లాభాలు ఇస్తామని హామీ ఇచ్చి భారీగా నిధులు సమీకరించినట్లు ఈడీ గుర్తించింది. మొత్తం రూ. 4,215 కోట్ల మేర పెట్టుబడులు సేకరించినట్లు వెల్లడించింది. కొత్త పెట్టుబడిదారుల నుంచి వచ్చిన డబ్బుతో పాత పెట్టుబడిదారులకు చెల్లింపులు చేసినట్లు దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గుర్తించింది. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు రూ. 792 కోట్లను నేర ఆదాయంగా గుర్తించినట్లు తెలిపింది. ఇప్పటికే ఈ కేసులో రంగారెడ్డి జిల్లాలోని ఆస్తులతో పాటు హాకర్ 800ం విమానం సహా రూ. 20.6 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ తాత్కాలికంగా జప్తు చేసింది. విచారణకు సహకరించకపోవడంతో ఖఓఒం సెక్షన్-19 కింద అమర్‌దీప్ కుమార్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. ఫాల్కన్ మనీలాండరింగ్ కేసులో నిధుల మళ్లింపు, ఇతర నిందితుల పాత్రపైనా ఈడీ దర్యాప్తు కొనసాగుతోంది.

## ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ కొరత రావద్దు

### అవసరమైన సరఫరా కొనసాగించాలన్న భట్టి

**హైదరాబాద్,జూలై18 :** ఎల్‌నినో సవాళ్లను ముందుగానే అంచనా వేసి రాష్ట్రంలో విద్యుత్ సరఫరాపై ఎలాంటి ప్రభావం పడకుండా ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందించడం మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగాన్ని విస్తరించడం, రాష్ట్రవ్యాప్తంగా 'పవర్ అంబులెన్స్' సేవలను బలోపేతం చేయడం, అంగన్‌వాడీ కేంద్రాలకు దశలవారీగా సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించడం, ఐటీ కారిడార్‌లో అవసరమైన చోట్ల ÷÷-లఓల్గ÷వర్ల కింద సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అదే విధంగా, తెలంగాణ భవిష్యత్ ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని సింగరేణి కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధన, తాడిచర్ల-2 బ్లాక్‌లో నిర్ణీత గడువులో ఉత్పత్తి ప్రారంభం, కోయగూడెం3, సత్తుపల్లి3 బ్లాక్‌లను సింగరేణికి దక్కేలా కార్యాచరణ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఇంధన భద్రతను మరింత బలోపేతం చేస్తూ ప్రతి రంగానికి విశ్వసనీయ విద్యుత్ అందించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి అన్నారు.

# ఆహార కల్తీపై ఇక ఉక్కుపాదం

- ప్రజల ప్రాణాలతో చెలగామడితే కఠిన చర్యలు
- ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం
- వాటి స్వచ్ఛతపైనా ఇకనుంచి పరిశీలిన
- అసెంబ్లీలో చర్చించి సమగ్ర చట్టం రూపకల్పన
- ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం



**హైదరాబాద్, జూలై 18:** ఆహార, ఔషధాల కల్తీని నిరోధించేందుకు కఠిన చట్టం రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు, ఆహార పదార్థాల కల్తీ వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఆహార, ఔషధ కల్తీ నియంత్రణపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు.. పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడటంతో పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో భారీ ధరలకు అమ్ముతున్నారని, అవి సేంద్రియ ఉత్పత్తులేనని నిర్ధరించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలకు వెళ్లి అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రంగా చర్చించడంతో పాటు.. ప్రజల అభిప్రాయాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కల్తీలకు సంబంధించి సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కల్తీల నిరోధానికి సంబంధించి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టులో వచ్చే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ క్రమంలో తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో కల్తీల నియంత్రణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చేరవేసేలా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విజిల్ బ్లోయర్ల వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అథారిటీ చట్టంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించిన అనంతరం బిల్లుకు తుది రూపం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. కల్తీల నియంత్రణలో ప్రపంచంలోని వివిధ దేశాల్లో అమలవుతున్న చట్టాలు, విధానాలను అధ్యయనం చేసి వాటిలో ఉత్తమ పద్ధతులను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో 'క్యూర్' ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ వ్యవస్థను అమలు చేసి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపింది. సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. రసాయన అవశేషాలు, కల్తీ కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, కల్తీలకు పాల్పడే వారిపై ఇకపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ సమీక్షలో డిజిపి ఆనంద్, సిఎస్ సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.

# నేనున్నంత వరకు బీఆర్ఎస్‌ను అధికారంలోకి రానివ్వను

- దొరల గడీల ముందు మోకరిల్లని కవి అందెశ్రీ
- అందెశ్రీని, గద్దర్‌ను అవమానించిన కేసీఆర్
- ఫామ్‌హౌజ్‌లతో కులకుతున్న నేతలు
- నిరుద్యోగులను మోసం చేసిన ఘనులు బీఆర్ఎస్ నేతలు
- అందెశ్రీ స్మృతివనం శంకుస్థాపనలో సిఎం రేవంత్ విమర్శలు



**హైదరాబాద్, జూలై 18:** దొరల గడీల ముందు మోకరిల్లనని ధైర్యంగా చెప్పిన కవి అందెశ్రీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కవిగా, గాయకుడిగా తెలంగాణ సమాజానికి సుపరిచితులైన ఆయన.. తనకు ఆత్మబంధువని చెప్పారు. ఆయన జయంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో 'అందెశ్రీ స్మృతివనం' నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందెశ్రీని ఆనాటి ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రజా గాయకుడు గద్దర్‌ను కూడా ప్రగతిభవన్ గేటు ఎదుట ఎర్రటి ఎండలో నిలబెట్టారని విమర్శించారు. వారిద్దరన్నీ అవమానించినప్పుడే దొరలను సాగనంపాలని జనం నిర్ణయించుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సీఎం, ఆయన తనకు ఆత్మబంధువని, కుటుంబ సభ్యుడిగా, పెద్దన్నగా భావించానని అన్నారు. అందెశ్రీ పాటలు లక్షలాది మందిలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపాయని, తనలోనూ ఉద్యమ చైతన్యాన్ని రగిలించాయని పేర్కొన్నారు. గడీల ముందు మోకరిల్లనని చెప్పిన కవి అందెశ్రీ ఎప్పుడూ దొరల గడప తొక్కలేదని, ఆయన గానంలో గొప్పతనం, సమాజానికి మార్గనిర్దేశం చేసే శక్తి ఉందన్నారు. ఒకప్పుడు నిర్బంధానికి గురైన అందెశ్రీ పాటే నేడు తెలంగాణ రాష్ట్ర గీతంగా మారడం చారిత్రక విషయమని చెప్పారు. ఆనాటి ప్రభుత్వం అందెశ్రీని అవమానించిందని, అలాగే ప్రజాకవి గద్దర్‌ను ప్రగతిభవన్ ఎదుట ఎండలో నిలబెట్టిన ఘటనను కూడా సీఎం గుర్తు చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. గ్రూప్ పరీక్షలు నిర్వహించి నిజంగా ఉద్యోగాలు ఇచ్చారా అని ప్రశ్నించారు. కేవలం నోటిఫికేషన్లు ఇచ్చి పేపర్లు లీక్ చేయడం ద్వారా కోట్లు సంపాదించారని ఆరోపించారు. తమ కుటుంబ సభ్యులు, బంధువులకే ఉద్యోగాలు, పదవులు కట్టబెట్టారని, కష్టపడి చదివిన నిరుద్యోగులను నిరాశపరిచారని విమర్శించారు. గతంలో ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలను ప్రస్తావించిన సీఎం, తెలంగాణను శవాలమయంగా మార్చింది ఎవరో ప్రజలకు తెలుసని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్న ఆయన, గత ప్రభుత్వం రాష్ట్రానికి రూ. 8 లక్షల కోట్ల అప్పులు మిగిల్చి ఫామ్‌హౌస్ రాజకీయాలు చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ నోటిఫికేషన్లు ఇస్తే ఈ ప్రభుత్వం ఉద్యోగాలిచ్చిందని ప్రతిపక్ష నేతలు నిస్సిగ్గుగా చెబుతున్నారని సీఎం మండిపడ్డారు. నిరుద్యోగులు, ఉద్యోగ నియామకాల గురించి ఒక్క రోజైనా బీఆర్ఎస్ పాలకులు ఆలోచించారా? 16 ఏళ్ల తర్వాత.. మేం అధికారంలోకి వచ్చాక గ్రూప్-1 నిర్వహించాం. బీఆర్ఎస్ పాలనలో ఎందరో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే దాదాపు 70 వేల ఉద్యోగాలిచ్చాం. తల్లిదండ్రుల సాక్షిగా వారందరికీ ఉద్యోగ నియామక పత్రాలిచ్చాం. కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ సమాజం శ్రీమంతుల్ని చేసింది. అలాంటి రాష్ట్రానికి వాళ్లు తిరిగి ఏమిచ్చారు? ఉన్నదంతా దోచుకున్నారు. కేసీఆర్ 1000 ఎకరాల్లో, కేటీఆర్ 100 ఎకరాల్లో, హరీశ్‌రావు 50 ఎకరాల్లో, కవిత 25 ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు. మీరు నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎలా మారారు? కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు అప్పుడే క్షమించారని అనుకుంటున్నారా? నేను ఉన్నంతవరకు మరోసారి మీ సర్కారును రానివ్వను. తెలంగాణను దోచుకోవాలని చూస్తే.. అందెశ్రీ మళ్లీ పాటై పుడతాడని రేవంత్‌రెడ్డి అన్నారు.

# స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలి

- 16 నుండి 26 వరకు 'బోనాలు- చేతివృత్తుల మేళా'
- ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శనలు
- మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్,జూలై18:** చేతి వృత్తి కళాకారులకు చేయూతనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వ బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 'బోనాలు- చేతివృత్తుల మేళా, బిసి చేతివృత్తుల అమ్మకాలు- ప్రదర్శన'ను ఈనెల 16వ తేదీ నుండి 26 వరకు ట్యాంక్ బండ్, అంబేద్కర్ విగ్రహము ప్రక్కన గల గ్రౌండ్స్ లో నిర్వహిస్తోంది. చేతివృత్తుల కళాకారులచే తయారు చేసిన వివిధ వస్తువుల ప్రదర్శన, విక్రయము విజయవంతంగా కొనసాగుతున్నది. ఈ ప్రదర్శనలో కుమ్మరులు వారు తయారు చేసిన మట్టిపాత్రలు, గౌడన్నల 'నీరా' స్టాల్, మేదరివారు తయారు చేసిన వెదురు వస్తువులు,హ్యాండ్ లూమ్స్ పోచంపల్లి-ఇక్కత్, గద్వాల్ - నారాయణపేట్, పూసలవారి సామగ్రి, మహిళా స్వయం సహాయక సంఘాల స్వగృహ ఫుడ్స్, ఇతర బిసి వర్గాలచే తయారు చేయబడిన వస్తువులు, తెలంగాణ వంటకాలు, మత్స్య కారుల తయారు చేయబడే చేప వంటకాలు, ఇతర భోజన స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శనలో లభించే వస్తువులు వినియోగదారులకు, సందర్శకులకు సరసమైన ధరలలో లభ్యమవుతున్నాయి. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 10:00 గంటల వరకు కొనసాగుతున్నది. ప్రభుత్వం సందర్శకులకు ప్రవేశము ఉచితంగా కల్పిస్తున్నది. ప్రదర్శనలో వివిధ రంగాలకు చెందిన 60 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి వస్తున్న విశేష ఆదరణతో స్టాల్స్ నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చేనేత, హస్తకళలు, మట్టి కళలు, చెక్క బొమ్మలు వంటి సంప్రదాయ కళలను ప్రోత్సహించడ మే ఈ మేళా ప్రధాన లక్ష్యమని, గ్రామీణ కళాకారుల ప్రతిభకు మార్కెట్ కల్పిస్తూ వారి జీవనోపాధిని బలోపేతం చేయడంలో ఇటువంటి మేళాలు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర బిసి సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 'వోకల్ ఫర్ లోకల్' భావనకు అనుగుణంగా స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలని, సాంప్రదాయ కళలను నేటి తరానికి పరిచయం చేసి, భావితరాలకు అందించడం మన అందరి బాధ్యత అని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కళాకారుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, మార్కెటింగ్ అవకాశాల విస్తరణకు కట్టుబడి ఉందన్నారు. మేళాలో పాల్గొన్న ప్రతి కళాకారుడికి అభినందనలు తెలియజేస్తూ, ప్రజలు పెద్ద ఎత్తున సందర్శించి హస్తకళ ఉత్పత్తులను కొనుగోలు చేసి కళాకారులను ప్రోత్సహించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మన కళలు, మన చేతివృత్తులు? మన సంపద అనే భావనతో ప్రతి ఒక్కరూ ఈ మేళాను విజయవంతం చేయాలన్నారు. బోనాల పండుగకు అవసరమైన బోనం కుండలతో పాటు సంప్రదాయ ఆచారాలకు ఉపయోగించే వివిధ రకాల వస్తువులను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానంలో అంతర్భాగమైన అనేక కులవృత్తులు కనుమరుగు అవ్వకుండా మరింతగా ప్రోత్సహించెందుకు ప్రభుత్వం ప్రదర్శనను ఏర్పాటు చేసింది.



# లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది

- జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏవీ
- కొలువుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళా
- ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయి
- తెలంగాణలో లూటీ జరుగుతోంది
- మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోంది
- చాయ్ పే చర్చాను మరచిన రాహుల్
- బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ ఘాటు విమర్శలు





**హైదరాబాద్, జూలై 18:** ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తప్పారని కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీకి తెలుగు రాదు.. మన బాధ తెల్వదు అని అన్నారు. అశోక్‌నగర్‌లో చాయ్‌పే చర్చా పెట్టింది అసలు రాహుల్‌గాంధీకి గుర్తుందా అని ప్రశ్నించారు. యువత తలరాత మారుస్తానని అబద్ధపు హామీలు ఇచ్చారని.. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీశారు. డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయి? విద్యా భరోసా ఏమైందని అడిగారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయని.. తెలంగాణలో లూటీ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోందని ఆరోపించారు. కొలువుల కుంభమేళా అని చెప్పి.. కుంభకోణాల కుంభమేళా చేస్తున్నారని మండిడ్డారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు అడిగితే ఉరికించి కొడుతున్నారని కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ మండిపడ్డారు. డిసెంబర్ 9 నుంచి ఉద్యోగ పర్వం కాదు.. ఉన్మాదపర్వం చూపిస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల పట్ల దౌర్జన్య కాండ కొనసాగుతోందని తెలిపారు. రాహుల్ గాంధీకి నిరుద్యోగుల ఆక్రోశం కనబడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగ అభ్యర్థుల శోకాలు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో దాడులు, ఓయూలో నిర్బంధాలు కనిపించడం లేదా అని అడిగారు. ఢిల్లీలో రాజ్యాంగం చేత పట్టుకుని రాహుల్ గాంధీ సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ నడిబొడ్డున ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే పట్టించుకునే వారే లేరని కేటీఆర్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు వదిలిపెట్టనని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని తెలిపారు. నవంబర్ 22న అవినీతి సొమ్ముతో జాబ్ క్యాలెండర్‌పై యాడ్‌లు వేశారని గుర్తుచేశారు. కానీ ఇవాళ జాబులు లేవు.. జవాబులు లేవని విమర్శించారు. ఉద్యోగాలు లేవు.. క్యాలెండర్ మారినా.. జాబ్ క్యాలెండర్‌కు దిక్కు లేదని అన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ చిత్తు కాగితాలుగా మారిందని విమర్శించారు. చరిత్రను మరిచిపోతే భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు. చరిత్రలు, ఇతిహాసాలు, పురాణాలు చదవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. తెలంగాణ ఉద్యమాల్లో చావగొట్టిన వాళ్లే మళ్లీ అధికారంలోకి వస్తారని తెలిపారు. కాంగ్రెస్ అలవిగాని హామీలు నమ్మి తెలంగాణ యువత మోసపోయింద్రు అని తెలిపారు. 1952, 1969లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువత గుండెల్లో గుణపాలు నింపిందని గుర్తుచేశారు. వేలమంది యువత ప్రాణాలు తీసుకున్నా కాంగ్రెస్‌కు రక్తదాహం తీరడం లేదని అన్నారు. మన రక్తం పొలాల మీద చల్లాలని చిల్లరమాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు, యూత్, మహిళ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. ఓటు కోసం కోటి మోసాలు చేస్తున్న కాంగ్రెస్ తీరు దేశానికి తెలియాలన్నారు. రేపటి తెలంగాణ నిర్మాతలు మీరు.. భవిష్యత్ నిర్ణేతలు మీరే అని యువతను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అలాంటి యువతను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తున్నదని మండిపడ్డారు. మీకు జరిగిన మోసం, వంచనను గుర్తుచేసుకుని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సరిగ్గా 38 నెలల కింద ఇదే సరూర్ నగర్ స్టేడియం సాక్షిగా తెలంగాణ యువత దగా పడిందని తెలిపారు. నిరుద్యోగులను వంచించిన దగాకోరులు కాంగ్రెస్ నాయకులు అని పేర్కొన్నారు. హైకమాండ్ తరలివచ్చి మాయామశ్చీంద్ర కార్యక్రమం ఇక్కడ చేశారని ఎద్దేవా చేశారు. యూత్ డిక్లరేషన్ పేరిట దుర్మార్గమైన వాగ్దానాల వరద పాటించారని మండిపడ్డారు. పాత కేటుగాళ్లు.. కొత్త డూప్లికేట్లు వచ్చి యువతపై లేని ప్రేమను కనబరిచారని తెలిపారు. యూత్‌కు ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చారా అని నిలదీశారు. ప్రైవేటు కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్ వచ్చిందా అని అడిగారు. కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు వచ్చాయా? యువతకు రూ.10లక్షల రుణాలు వచ్చాయా? ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వచ్చాయా? అని ప్రశ్నించారు. నాలుగు ట్రిపుల్‌ఐటీలు, మూడు యూనివర్సిటీలు వచ్చాయా? నెలకు రూ.4వేల భృతి వచ్చిందా? పదో తరగతిలో రూ.10వేలు, ఇంటర్ పాసైతే రూ.15వేలు వచ్చాయా? డిగ్రీ ఉత్తీర్ణులతై లక్ష వచ్చాయా? పీహెచ్‌డీ పాసైతే రూ.5లక్షలు వచ్చాయా? అని ప్రశ్నించారు. ఇంత మోసానికి పాల్పడిన వారిని ఏమనాలో ఆలోచించాలని సూచించారు. దగుల్బాజీలా.. దోకేబాజ్‌లు అనాలో మీరే ఆలోచించాలన్నారు. జిత్తులమారి ముసలి నక్క కాంగ్రెస్ యువజనాన్ని తెలివిగా చిత్తు చేసిందని కేటీఆర్ విమర్శించారు. 60 ఏళ్లు నెత్తురు మరిగిన కాంగ్రెస్ యువతను ఎలా మోసం చేసిందో గుర్తించాలన్నారు. కాంగ్రెస్ మోసపు వలలో పడిపోయి గోసపడుతున్నారని తెలిపారు. 31 నెలలు గడిచాయి.. నిరుద్యోగులకు కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. మాటతప్పి వంచించి, నమ్మించి నట్టేట ముంచి అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. యువతరంతో పెట్టుకుంటే కొన్ని తరాలు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

## స్కైరూట్ మన టీ హబ్‌లోనే పుట్టింది

**హైదరాబాద్, జూలై 18:** టి హబ్ వేదికగా ఏర్పడ్డ స్కైరూట్ సంస్థ శ్రీహరికోటలో చేపట్టిన విక్రమ్-1 రాకెట్ ప్రయోగ విజయవంతం కావడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్ సరూర్ నగర్‌లో తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ మాట్లాడుతూ.. టీ హబ్‌లో పురుడు పోసుకున్న కంపెనీ పేరు స్కైరూట్. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏండ్లు అయింది. ఇవాళ భారతదేశ చరిత్రలో ఒక ప్రైవేట్ రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపిన ఆ కంపెనీ మన టీహబ్ నుంచే వచ్చిందన్నారు. ఇవాళ ఉదయమే ప్రయోగం విజయవంతంగా నిర్వహించారు. ఈ రోజు శ్రీహరికోట నుంచి ప్రైవేట్ రాకెట్‌ను పంపిన స్కైరూట్ కంపెనీకి చప్పట్లతో అభినందనలు తెలుపాలని కేటీఆర్ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు. ఇస్రో నుండి తొలిసారి ప్రైవేట్ రాకెట్ ప్రయోగం సక్సెస్ అవడంతో స్కైరూట్ కంట్రోల్ సెంటర్‌లో సంబురాలు చేసుకుంటున్నారు.



# నేను ఎప్పుడూ పదవులు అడుక్కోను

## నా నిర్ణయాలన్నీ సంచలనంగానే ఉంటాయి

## ఎమ్మెల్యే రాజగోపాలరెడ్డి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, జూలై 18:** నేను ఎప్పుడూ పదవులు అడుక్కోను.. నేనొక ఫైటర్‌ను. నేను ఏ నిర్ణయం తీసుకున్నా అది ఒక రెవల్యూషన్ లాగే ఉంటుందని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే.. తనను ఓడించడానికి వంద మంది ఎమ్మెల్యేలు మునుగోడుకు వచ్చారని, అలాగే ఎమ్మెల్సీ పోటీలో తాను నిలబడితే ఆనాడు కేసీఆర్‌కు నిద్ర కూడా పట్టలేదని తన రాజకీయ రికార్డును గుర్తుచేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మీడియా ప్రతినిధులతో జరిపిన చిట్‌చాట్‌లో సంచలన వ్యాఖ్యలు చేశారు. తన మంత్రి పదవి, కుటుంబంలో ఇద్దరికి పదవుల అంశంపై వస్తున్న విమర్శలపై ఆయన తనదైన శైలిలో స్పందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడకముందు జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ.. ఎన్నికల ముందు ఏఐసీసీ నాయకత్వం ఆరుగురు సీనియర్లకు మంత్రి పదవులు ఇస్తామని హామీ ఇచ్చిందని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. ‘హైకమాండ్ ఆరుగురిలో ఐదుగురికి మంత్రి పదవులు ఇచ్చింది. కానీ నా ఒక్కడికే ఇవ్వలేదు. అలాగని నేను పదవి కోసం అడుక్కునే టైం ఇది కాదు‘ అని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి పదవి దక్కకపోవడంపై తన అంతరంగాన్ని ఆయన ఈ సందర్భంగా బయటపెట్టారు. సొంత అన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇప్పటికే క్యాబినెట్ మంత్రిగా ఉన్నందున, ’ఒకే కుటుంబానికి ఒకే పదవి’ అనే నిబంధన వల్లే రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి దక్కలేదనే ప్రచారంపై ఆయన తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫ్యామిలీ రూల్స్‌పై స్పందిస్తూ.. భార్యాభర్తలు మాత్రమే ఒక కుటుంబం కిందకు వస్తారు. కానీ అన్నాదమ్ములు ఒకే కుటుంబం ఎలా అవుతారని ప్రశ్నించారు. దీనికి ఉదాహరణగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులను ప్రస్తావిస్తూ.. ‘ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన భార్య పద్మావతి ఇద్దరూ ఒకే ఫ్యామిలీ అవుతారు. కానీ మేము అన్నదమ్ములం, ఇద్దరం వేర్వేరు ఇళ్లలో ఉంటున్నాం. అలాంటప్పుడు అన్న, నేను ఇద్దరం ఒకే కుటుంబం అంటే ఎలా కుదురుతుందని రాజగోపాల్ రెడ్డి నిలదీశారు. భిన్నమైన ఇళ్లలో ఉంటూ రాజకీయంగా విడివిడిగా కష్టపడుతున్న తమకు ఈ నిబంధన వర్తింపజేయడం సరికాదనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# బహదూర్‌గూడాలో మరోమారు ఉద్రిక్తత

## పోలీసులపై కారం చల్లి.. కుర్చీలతో దాడి

**రంగారెడ్డి, జూలై 18:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధిలోని బహదూర్‌గూడలో మరోసారి ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇక్కడి ప్రభుత్వ భూమికి హైడ్రా అధికారులు ఫెన్సింగ్ వేయడంతో స్థానికులు ఆందోళనకు దిగారు. భూములు సాగు చేసుకుంటున్న తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆందోళనకారులు పోలీసులపైకి కారం చల్లి, కుర్చీలు విసిరేశారు. డీసీపీ యోగేశ్ గౌతమ్‌తో సహా పలువురు సీఐల కళ్లలో కారం పడింది. ఈ క్రమంలో రైతులకు మద్దతిస్తున్న నేతలను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులపై కారం చల్లి, కుర్చీలు విసరడం సరికాదని డీసీపీ యోగేశ్ గౌతమ్ అన్నారు. ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ మాత్రమే వేస్తున్నామని, సాగులో ఉన్న పంటను పాడు చేయడం లేదని అన్నారు. రైతులు శాంతియుతంగా నిరసన తెలపాలని కోరారు. ఉదయం కూడా రైతులు ఇక్కడ ఆందోళన చేపట్టారు. బు÷-లలెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం సేకరించిన స్థలంలో కంచె వేసేందుకు వెళ్లిన రెవెన్యూ, హైడ్రా అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. 650 ఎకరాల భూమికి హైడ్రా సాయంతో కంచె వేసేందుకు వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. కంచె వేయడాన్ని నిరసిస్తూ ఆర్డీవో శ్రీధర్‌తో స్థానికులు వాగ్వాదానికి దిగారు. ఉదయం నుంచి నిరసనలు కొనసాగుతుండగా.. తాజాగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి.

# రవాణాశాఖ నిబంధలు కఠినతరం

## నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై నజర్

## తనిఖీలు ముమ్మరం చేయనున్న అధికారులు

**హైదరాబాద్, జూలై 18:** రాష్ట్రవ్యాప్తంగా రవాణా నిబంధనలను కఠినతరం చేశారు. ఉల్లంఘించే వాహనాలపై ఉక్కుపాదం మోపాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించడంతో అధికారులు తగు చర్యలకు దిగుతున్నారు. ముఖ్యంగా స్కూల్ బస్సులతో పాటు, అధికా లోడ్‌తో వెళ్లే వాహనాలపై దృష్టి సారించారు. రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలను మరింత విస్తృతం చేసి, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఓవర్‌లోడింగ్ వాహనాలు, త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనాలు, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ లేని వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలను అవసరమైతే వెంటనే సీజ్ చేయాలని రవాణా అధికారులు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. గతంలో చెక్‌పోస్టులను రద్దు చేసిన సమయంలోనే ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత బలోపేతం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అందువల్ల ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిబ్బందిని అత్యంత సమర్థవంతంగా వినియోగించుకుంటూ తనిఖీల వేగాన్ని పెంచనున్నారు. జూన్ 8 నుంచి ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా రంగంలోకి దించిన మొబైల్ స్క్వాడ్‌ల పనితీరును ఇటీవలే మంత్రి పొన్నం సమీక్షించారు. త్రైమాసిక పన్నులు చెల్లించకుండా ఎగవేస్తున్న వాహన యజమానులపై భారీ జరిమానాలు విధించడంతో పాటు వాహనాలను స్వాధీనం చేసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. అలాగే ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని.. స్లీపర్ బస్సుల్లో జరిగే నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం ఉపేక్షించకుండా, గుర్తించిన వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# బీజేపీ నేతల్లో ఎలాంటి విభేదాలు లేవు

- అందరం కలసి అధికారం కోసం కృషి చేస్తున్నాం
- బండి సంజయ్, ఈటెల మధ్య సయోధ్యకు యత్నం
- ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఇద్దరు నేతలతో అభయ్ పాటిల్ చర్చలు
- తెలంగాణలో అధికారం బీజేపీదేనన్న ఎంపీ లక్ష్మణ్



**హైదరాబాద్, జూలై 18:** తెలంగాణ భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవని, అందరం కలసి అధికారం కోసం కృషి చేస్తున్నామని బిజెపి ఎంపి లక్ష్మణ్ అన్నారు. బండి సంజయ్, ఈటెల రాజేందర్ మధ్య ఉన్న విభేదాలపై ఆయన స్పందించారు. కీలక నేతల మధ్య విభేదాలపై అధిష్ఠానం దృష్టి సారించింది. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ తో ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్ భేటీ అయ్యారు. ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఇరువురు నేతలతో గంట పాటు సమావేశం జరిగింది. పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని అభయ్ పాటిల్ వారికి సూచించారు. కరీంనగర్ నియోజకవర్గానికి సంబంధించిన అంశాల్లో ఇద్దరూ కలిసి పని చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే.. అంతర్గతంగా పరిష్కరించుకోవాలని ఆదేశించారు. అనంతరం ఇరువురు నేతలతో కలిసి ఎంపీ లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో భాజపాను అధికారంలోకి తీసుకురావడంపై చర్చించినట్లు తెలిపారు. ప్రజలకు కాంగ్రెస్‌పై కోపం ఉందని, అలాగే బీఆర్ఎస్‌పై నమ్మకం లేదని తెలిపారు. వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ, లోక్‌సభ సీట్లు పెరుగుతాయని, జమిలి ఎన్నికలు జరుగుతాయన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. భాజపాను అధికారంలోకి తెచ్చేందుకు తామంతా కలిసి పనిచేస్తామని వివరించారు. తెలంగాణలో అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉన్న బీజేపీ.. ఆ దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఈ క్రమంలోనే నేతల మధ్య విభేదాలను తొలగించి.. అందరినీ ఒక తాటిపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. ఎంతో కాలంగా విభేదాలతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చారు. వీరిద్దరి మధ్య రాజీ కుదిర్చేందుకు రంగంలోకి దిగిన బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్.. నేడు ఈటల రాజేందర్, బండి సంజయ్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదికగా జరిగిన ఈ సమావేశంలో ఈటల, బండి మధ్య రాజీ కుదిర్చారు. విభేదాలు పక్కనపెట్టి.. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చే దిశగా కృషి చేయాలని ఇద్దరు నేతలకు అభయ్ పాటిల్ దిశానిర్దేశం చేశారు. భేటీ అనంతరం మీడియా ముందుకు బీజేపీ నేతలు.. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ తీరుతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందంటూ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధిపై మోదీ ప్రత్యేక చొరవ చూపారని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ఆయిల్ పామ్ కోసం ఏకమవుదాం

## కేంద్రంపై ఒత్తిడి పెంచుదాం రండి

## దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులకు తుమ్మల లేఖ

**హైదరాబాద్, జూలై 18:** కేంద్రంపై ఉమ్మడిగా ఒత్తిడికి దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. ఆయిల్ పామ్ రైతుల కోసం దక్షిణాది రాష్ట్రాలు ఏకమవ్వాలని కోరారు. ప్రధాని మోదీని కలిసి ఆయిల్ పామ్ రైతుల సమస్యలు వినిపిద్దామన్నారు. ఆయిల్ పామ్‌కు కనీస హామీ ధర రూ.25 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. లేదంటే క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పునరుద్ధరించాలన్నారు. దిగుమతి సుంకాల తగ్గింపుతో రైతులకు భారీ నష్టం వాటిల్లుతోందని మంత్రి తెలిపారు. దేశ ఆయిల్ పామ్ సాగులో 75 శాతం వాటా దక్షిణాది రాష్ట్రాలదే అని చెప్పుకొచ్చారు. రైతులకు స్థిర ఆదాయం కోసం కేంద్రం తక్షణ జోక్యం అవసరమన్నారు. వంటనూనెల స్వయం సమృద్ధి లక్ష్యానికి రైతుల రక్షణ కీలకమన్నారు. ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాల కోసం దక్షిణాది రాష్ట్రాలు కలిసిరావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.



# కాళేశ్వరం వివాదం

## ఆత్మరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం!

దొంగలుపడ్డ ఆరు నెలలకు ...అన్న చందంగా ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్న తరుణంలో ఇప్పుడు ధరణిపై విచారణకు ఓ కమిటీని వేయాలని రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయం నవ్వులు తెప్పించేదిగా ఉంది. కెసిఆర్, బిఆర్ఎస్ అవినీతిపై పెద్దపెద్ద మాటలు మాట్లాడి అధికారంలోకి వచ్చిన రేవంత్ ఇప్పటి వరకు పైసా అవినీతిని నిరూపించ లేకపోయారు. కాళేశ్వరం, ధరణి, ఈ కార్ రేస్, పవర్ ప్లాంట్లు, విద్యుత్ ఒప్పందాలు తదితర అంశాలన్నీ ఇప్పుడు ప్రచార వస్తువుగా మారాయి. కేవలం బిఆర్ఎస్‌పై రాజకీయంగా పైచేయి సాధించేందుకు మాత్రమే విమర్శలు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా కాళేశ్వరం కూలేశ్వరం అంటూ చేసిన ఆరోపణల్లో ఇంచు కూడా ముందుకు కదలలేదు. లక్షకోట్లు పెట్టిన ప్రాజెక్ట్ పడావు పడ్డది. దానిని ఎలాగైనా వినియోగంలోకి తేవడం ద్వారా ప్రజాధనాన్ని కాపాడాలన్న ముందుచూపు లేకుండా పోయింది. ఎంతసేపు రాజకీయంగా విమర్శలు తప్ప ఈ ప్రభుత్వం గత బిఆర్ఎస్ చేసిన అవినీతిపై ఎలాంటి పురోగతి సాధించలేదు. రేవంత్ రెడ్డి దీనిని కేవలం రాజకీయంగా ఉపయోగించు కుని బిఆర్ఎస్‌ను భ్రష్టు పట్టించే యోచనలో ఉన్నారా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఎందుకంటే కాళేశ్వరాన్ని పక్కన పెట్టి ఇప్పుడు మళ్లీ ప్రాణహిత అంటూ పల్లవి అందుకున్నారు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం, వినిగింలోకి ఎలా తేవడం అన్న ఆలోచన పక్కన పెట్టారు. అందుకే నిత్యం కాళేశ్వరం ప్రాజెక్టు వివాదం కొనసాగుతూనే ఉంది. రాజకీయ విమర్శలకు కాళేశ్వరం వేదికగా మారుతోంది. పరస్పర విమర్శలు తప్ప గోదావరి జలాలను ఎలా ఉపయోగించుకోవాలన్నది ఆలోచించడం లేదు. కాలేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల వ్యవహారం కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు, పరస్పర ప్రజెంటేషన్లకు కేంద్రంగా మారింది. ఎల్‌నినో ప్రభావంతో వానలు వెనక్కి పోయాయి. మరో వైపు కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు తరలింపు అసాధ్యమని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేసినప్పటికీ మెడిగడ్డ వద్ద కొన్ని పిల్లర్లు కుంగడంతో ఇక అది పనికిరాదన్న రీతిలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మోటర్లు, కాలువలు అంతా వృధా అవుతున్నాయి. ఇదే విషయాన్ని బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ప్రస్తావిస్తే.. ఆయనను బిఆర్ఎస్ ఏజెంట్‌గా అభివర్ణించి విమర్శలతో దాడి చేశారు. నిజానికి గత 2023 శాసనసభ ఎన్నికలలో బీఆర్ఎస్ ఓటమిలో కాళేశ్వరం, ధరణి అక్రమాలు ప్రధాన భూమిక పోషించాయి. అధికారంలోకి రావడానికి అనేకానేక హామీలు, వాగ్దానాలు గుప్పించిన రేవంత్ సర్కార్ ఇప్పుడు గుడ్డెద్దు చేలో పడ్డదన్నట్లుగా సాగుతున్నారు. పదికాలాలపాటు పనికి వచ్చే పనులు చేయడం లేదు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎలాంటి విధానం అనుసరించాలన్న దానిమీద సరైన అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారు. కాళేశ్వరం పిల్లర్లను పునరుద్ధరించే ప్రయత్నాలు చేసి, నీటిని వినియోగంలోకి తీసుకుని వచ్చివుంటే, ఈయేడు మంచి ఫలితాలు వచ్చేవి. ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేది. కానీ కాళేశ్వరం ప్రాజెక్టను ఉపయోగించరాదన్న మొండి వైఖరితో రేవంత్ ఉన్నట్లుగా కనిపిస్తోంది. ఆ ప్రాజెక్టు భద్రత ప్రమాదంలో ఉందని నేషనల్ డామ్ సేఫ్టి అథారిటి చెప్పిందని, అందువల్ల అక్కడ నీటిని వినియోగంలోకి తసీఉకుని రావడం అసాధ్యమని చెబుతున్నారు. కాళేశ్వరం ఎటిఎంగా మారిందని గతంలో బిజెపి కూడా ఆరోపించింది. రేవంత్ రెడ్డి కూడా ఇదే ప ÷-రచారం చేశారు. పోనీ అలాగని ఇందులో జరిగిన అవినీతిని వెలికితీసి కెసిఆర్ తదితరులను దోషులుగా నిలబెట్టి ఉంటే రేవంత్ ఇమేజ్ పెరిగేది. కానీ ఆరోపణలతోనే రెండున్నరేళ్లుగా కాలయాపన చేస్తున్నారు. కాళేశ్వరం కమిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. జస్టిస్ పిసి ఘోష్ కమిటీ రిపోర్టుపై హైకోర్టు స్టే విధించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీష్ రావులను అరెస్టు చేస్తారేమో అన్నంతగా ప్రచారం జరిగింది. అంతా తుస్సుమంది. ఇప్పుడు కమిషన్ రిపోర్టుకు కూడా పెద్ద విలువ లేకుండా పోయిందా అన్న అనుమానాలు వస్తున్నాయి. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు బారేజీలైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద నీరు నిల్వచేసి పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని తోడి ఆయా ప్రాంతాలలో ఉన్న రిజర్వాయిర్‌లను నింపాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ఇందుకు రేవంత్ ససేమిరా అనడంతో చంద్రబాబు కోసం గోదావరి జలాలలను కిందికి జారవిడుస్తున్నారని బిఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఒక వైపు వర్షాభావ పరిస్థితులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అందువల్ల వర్షాలు తక్కువగా ఉన్న ప్రాంతాలకు నీరు ఎలా ఇవ్వవచ్చా అన్నదానిపై ఆలోచన చేసి ఉండాల్సింది. కేసీఆర్ కట్టించినంత మాత్రాన ఆ ప్రాజెక్టు కెసిఆర్‌ది అయిపోదు. ఇదంతా ఒక ఎత్తయితే ఇప్పుడు రాజకీయంగా రేవంత్‌ను ఏకిపారేయడంలో బిఆరెస్ మెల్లగా పైచేయి సాధిస్తోంది. మంత్రులు అవినీతిలో కూరుకు పోయారని కెటిఆర్, హరీష్ రావులు రోజూ విమర్శలు చేస్తున్నారు. కమీషన్లు లేనిదే మంత్రులు కాలు బయటపెట్టడం లేదని అంటున్నారు. ఈ ఎదురుదాడితో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఓ రకంగా ఆత్మరక్షణలో పడిపోయింది. సింగరేణి తదితర విషయాల్లో గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లు అయ్యింది. ఈ క్రమంలోనే వాదోపవాదాలు, విమర్శ, ప్రతి విమర్శలతో రాజకీయ వేడెక్కింది. అవినీతి అంటూ ఆరోపించిన రేవంత్ నిరూపించలేదు. దీనికి బదులుగా కేటీఆర్, హరీష్‌రావులే గట్టిగా బదులు ఇస్తున్నారు. దీనివల్ల కూడా రేవంత్ అసహనానికి గురి అవుతున్నారనిపిస్తోంది. ఒక వేళ నిజంగానే గోదావరి నీటిని లిఫ్ట్ చేయడంలో ఇబ్బంది ఉంటే, ఎన్‌డిఎస్ఎ నివేదికపై అఖిలపక్షం నిర్వహించి చర్చ చేయాలి. బారేజీల వద్దకు, పంప్ హౌస్‌ల వద్దకు రిటైర్డ్ ఇంజనీర్లను తీసుకునివెళ్లి ఇరిగేషన్ అధికారుల ద్వారా పరిస్థితిని వివరించాలి. కానీ ఇవేవీ చేయకపోవడంతో ఇప్పుడు కాళేశ్వరమే బిఆర్ఎస్‌కు ఆక్సిజన్ నింపుతోంది.

# భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం

- 'విక్రమ్-1' తొలి ప్రయోగం విజయవంతం
- దేశ తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్‌తో చరిత్ర సృష్టించిన స్కైరూట్
- 35 నిమిషాల ఆలస్యానంతరం నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్
- 450 కిలోమీటర్ల కక్ష్యలో ఆరు పేలోడ్ల విజయవంత ప్రవేశం
- స్కైరూట్ బృందానికి ప్రధాని మోదీ సహా పలువురి అభినందనలు



శ్రీహరికోట, జూలై 18: భారత అంతరిక్ష రంగంలో చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు అంతరిక్ష సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ రూపొందించిన 'విక్రమ్–1' రాకెట్ తొలి ప్రయోగంలోనే విజయవంతమైంది. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి శనివారం మధ్యాహ్నం 12.05 గంటలకు నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్, ఆరు పేలోడ్లను సుమారు 450 కిలోమీటర్ల ఎత్తులోని భూ దిగువ కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టింది. దీంతో ప్రైవేటు సంస్థ అభివృద్ధి చేసిన రాకెట్ ద్వారా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపిన దేశాల సరసన భారత్ నిలిచింది. 'మిషన్ ఆగమన' పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం తొలుత ఉదయం 11.30 గంటలకు జరగాల్సి ఉంది. రాకెట్ స్వయంచాలక ప్రయోగ క్రమం చివరి దశలో నిలిచిపోవడంతో ప్రయోగాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. శాస్త్రవేత్తలు సాంకేతిక సమస్యను గుర్తించి సరిచేయడంతో 35 నిమిషాల అనంతరం రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించారు. ప్రయోగం ప్రారంభమైన సుమారు 15 నిమిషాల్లోనే పేలోడ్లు నిర్దేశిత కక్ష్యలోకి చేరాయి.

### ఆరు పేలోడ్లతో అంతరిక్ష యానం

విక్రమ్–1 రాకెట్ ద్వారా రెండు ఉపగ్రహాలతో పాటు వివిధ సంస్థలకు చెందిన సాంకేతిక ప్రదర్శన పేలోడ్లను అంతరిక్షంలోకి పంపారు. గ్రహా స్పేస్, కాస్మోసెర్వ్, డీక్యూబ్‌డ్ సంస్థల పేలోడ్లతో పాటు స్కైరూట్ రూపొందించిన 'స్కోపా' కూడా ఇందులో ఉంది. రాకెట్‌లోని ప్రొపల్షన్, దశల విభజన, ఏవియానిక్స్, టెలిమెట్రీ, మార్గదర్శక, నావిగేషన్, నియంత్రణ వ్యవస్థల పనితీరును ఈ ప్రయోగం ద్వారా పరీక్షించారు. సేకరించిన సమాచారాన్ని భవిష్యత్తు వాణిజ్య ప్రయోగాలకు వినియోగించనున్నట్లు స్కైరూట్ తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో 'వందేమాతరం' అని రాసిన ప్రత్యేక పోస్టుకార్డును కూడా రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపారు. శాస్త్రవేత్తలు, వ్యోమగాములు, స్కైరూట్ సభ్యులు పంపిన చేతిరాత సందేశాలతో పాటు భారత శాస్త్రవేత్తలు సర్ సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాం సూక్ష్మ రూపాలతో రూపొందించిన విక్రమ్–1 నమూనాను ప్రత్యేక పేలోడ్ పెట్టెలో ఉంచారు.

### ఏడంతస్తుల ఎత్తు.. దేశీయ సాంకేతికత

సుమారు 22 మీటర్ల ఎత్తు కలిగిన విక్రమ్–1ను పూర్తిగా కార్బన్ మిశ్రమ పదార్థాలతో నిర్మించారు. మూడు ఘన ఇంధన దశలు, తిరిగి పనిచేయగల ద్రవ ఇంధన తుది దశతో రాకెట్‌ను రూపొందించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన త్రిమితీయ ముద్రిత ఇంజిన్‌ను ఇందులో వినియోగించారు. సుమారు 350 కిలోల బరువున్న చిన్న ఉపగ్రహాలను భూ దిగువ కక్ష్యలోకి తీసుకెళ్లే సామర్థ్యం దీనికి ఉంది. స్కైరూట్ సంస్థ 2022లో 'విక్రమ్–ఎస్' ఉపకక్ష్య రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. తాజాగా విక్రమ్–1 ద్వారా దేశ తొలి ప్రైవేటు ఆర్బిటల్ ప్రయోగాన్ని పూర్తి చేసి అంతర్జాతీయ వాణిజ్య అంతరిక్ష మార్కెట్‌లోకి అడుగుపెట్టింది.

### స్కైరూట్ బృందానికి మోదీ అభినందనలు

విక్రమ్–1 ప్రయోగం విజయవంతమైన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ స్కైరూట్ బృందంతో ఫోన్‌లో మాట్లాడి అభినందించారు. ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించానని, యువ శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల కృషి దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని, భారత అంతరిక్ష ప్రస్థానాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. స్కైరూట్ శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు తనను కలవాలని ఆహ్వానించారు.

### నేతల హర్షం

విక్రమ్–1 విజయం భారత అంతరిక్ష రంగంలో మరో చారిత్రక మైలురాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో, ఇన్‌స్పేస్, ఎన్‌ఎస్ఐఎల్ బృందాలను అభినందించారు. శాస్త్రీయ సంస్థల సామర్థ్యం, పారిశ్రామికవేత్తల సృజనాత్మకత కలిస్తే అద్భుతాలు సాధించవచ్చని ఈ ప్రయోగం నిరూపించిందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ ప్రయోగాన్ని భారతీయ ప్రతిభ, శాస్త్రీయ సామర్థ్యం, ఆవిష్కరణల శక్తికి ప్రతీకగా అభివర్ణించారు. ప్రైవేటు భాగస్వామ్యంతో అంతరిక్ష రంగంలో యువతకు, అంకుర సంస్థలకు కొత్త అవకాశాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ తన కుమారుడు దేవాన్ష్‌తో కలిసి శ్రీహరికోటలోని వీక్షణ కేంద్రం నుంచి ప్రయోగాన్ని ప్రత్యక్షంగా తిలకించారు. ఇస్రో మాజీ ఛైర్మన్లు, సీనియర్ శాస్త్రవేత్తలు కూడా ప్రయోగాన్ని వీక్షించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్కైరూట్ ఘనతపై హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న సంస్థ దేశ తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించడం తెలంగాణ ఆవిష్కరణ శక్తికి నిదర్శనమన్నారు. దేశ అంతరిక్ష కలలకు తెలంగాణ చిరునామాగా నిలిచిందని స్కైరూట్ బృందాన్ని అభినందించారు.

# బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు

- ఎనిమిది మంది దుర్మరణం..
- 15 మందికి తీవ్ర గాయాలు
- అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్న ఫ్యాక్టరీ
- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రధాని మోదీ



**అహ్మదాబాద్, జూలై 18:** గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరంలో బాణసంచా కర్మాగారంలో జరిగిన భారీ పేలుడు తీవ్ర విషాదానికి దారితీసింది. రామోల్-గత్రాడ్ రోడ్డులోని ఓ అక్రమ బాణసంచా కర్మాగారంలో శనివారం సంభవించిన పేలుడులో ఎనిమిది మంది మృతి చెందగా, మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు తీవ్రతకు కర్మాగారం భారీగా ధ్వంసమైంది. వస్త్రాల్‌లోని ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ శిబిరం సమీపంలో ఈ ఘటన జరగడంతో పేలుడు శబ్దం వినగానే భద్రతా సిబ్బంది ముందుగా సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. అనంతరం ఐదు అగ్నిమాపక వాహనాలతో చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీసి ఆస్పత్రులకు తరలించారు. క్షతగాత్రుల్లో నలుగురిని ఎల్‌జీ ఆస్పత్రికి, మరో ముగ్గురిని అసర్వా సివిల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రాథమిక విచారణలో పేలుడు సంభవించిన బాణసంచా కర్మాగారం ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. పేలుడు శబ్దం దాదాపు ఐదు కిలోమీటర్ల దూరం వరకు వినిపించిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు.

# పర్యావరణవేత్త వాంగ్‌చుక్ ఆస్పత్రికి తరలింపు

- హైకోర్టు ఆదేశాలతో పోలీసుల నిర్ణయం
- 21 రోజుల దీక్షతో క్షీణించిన ఆరోగ్యం
- సఫ్దర్ జంగ్ ఆస్పత్రికి తరలించి చికిత్స
- దీప్కే నిరవధిక దీక్ష ప్రారంభం



**న్యూఢిల్లీ, జూలై 18:** 21 రోజులుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరాహార దీక్ష చేస్తున్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు శనివారం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. వాంగ్‌చుక్‌కు తక్షణ వైద్య చికిత్స అందించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో పోలీసులు ఈ చర్య చేపట్టారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించే సమయంలో నిరసనకారులు అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అనంతరం పోలీసులు ఆయనను భద్రత మధ్య సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. జంతర్‌మంతర్ వద్ద శాంతిభద్రతలు పాటించాలని, నిరసనకారులు ప్రశాంతంగా వ్యవహరించాలని ఢిల్లీ పోలీసులు కోరారు. ఇదిలా ఉండగా, తన అనుమతి లేకుండా భర్తకు ఎలాంటి వైద్య చికిత్స అందించవద్దని వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జె. ఆంగ్మో కోరారు. తమ కుటుంబ వైద్యుడి సలహా లేకుండా చికిత్స ప్రారంభించరాదని, అన్ని వైద్య వివరాలను కుటుంబ సభ్యులకు అందించాలని ఆమె డిమాండ్ చేశారు. నిరాహార దీక్ష కారణంగా వాంగ్‌చుక్ తీవ్ర బలహీనతతో పాటు డీహైడ్రేషన్‌కు గురయ్యారని వైద్యులు వెల్లడించారు. ఆయనకు నిరంతర వైద్య పర్యవేక్షణ, అవసరమైన చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి వద్ద భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలోకి ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతి ఇవ్వలేదని, వైద్య పరీక్షల వివరాలు అందించలేదని వాంగ్‌చుక్ భార్య ఆసుపత్రి అధికారులను ప్రశ్నించారు.

### దీప్కే నిరవధిక దీక్ష ప్రారంభం

సోనమ్ వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించిన నేపథ్యంలో ఉద్యమం ఆగిపోదని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. వాంగ్‌చుక్ స్థానంలో తానే నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. మద్దతుదారులు వెనుకడుగు వేయకుండా జంతర్‌మంతర్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు. జులై 20న నిర్వహించనున్న 'చలో సంసద్' పాదయాత్ర యథావిధిగా కొనసాగుతుందని దీప్కే స్పష్టం చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు.

# కోస్గి ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలో, గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుండి దరఖాస్తులకు ఆహ్వానం

**డాక్టర్. యం. శ్రీనివాసులు కళాశాల ప్రిన్సిపాల్**




**కోస్గి మున్సిపల్ (మం)జులై,18**

ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, కొస్గిలో 2026–27 విద్యా సంవత్సరానికి గాను గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్,తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు కళాశాలకు మొత్తం 16 గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు మంజూరయ్యాయి. వాటిలో సివిల్ ఇంజినీరింగ్ – 4, కంప్యూటర్ ఇంజినీరింగ్ (CSE) – 3, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (EEE) – 3, గణితం – 2, భౌతిక శాస్త్రం – 2, రసాయన శాస్త్రం – 2 పోస్టులు ఉన్నాయి.అర్హులైన అభ్యర్థులు తమ పూర్తి బయోడేటా (Resume), విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాల ప్రతులతో కూడిన దరఖాస్తులను 2026 జూలై 20 నుండి 2026 జూలై 22 వరకు ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, కొస్గి కార్యాలయంలో సమర్పించవచ్చు.2026 జూలై 23వ తేదీ ఉదయం 10.00 గంటలకు కళాశాల ప్రాంగణంలో సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం డెమో మరియు ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయి.అభ్యర్థులు తప్పనిసరిగా అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ ప్రతులను తీసుకురావాలి.సంబంధిత విభాగంలో AICTE నిర్దేశించిన అర్హతలు కలిగిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.ఎంపిక పూర్తిగా అర్హతలు,డెమో మరియు ఇంటర్వ్యూ ఆధారంగా జరుగుతుందని పేర్కొన్నారు.మరిన్ని వివరాలకు కార్యాలయ పని వేళల్లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, కొస్గి కార్యాలయాన్ని సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

# నీట్ ర్యాంకర్లు, స్వర్ణ పతక విజేత సాయి ప్రవల్లికను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 18**



ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ సంస్థలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తెలంగాణ గురుకుల విద్యాసంస్థల (TGSWREIS)కు చెందిన నీట్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, తొలి ఆసియా అండర్–23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2026 మహిళల 4×400 మీటర్ల రిలేలో స్వర్ణ పతకం గెలిచిన సాయి ప్రవల్లిక మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గురుకుల విద్యార్థులు సాధించిన నీట్ విజయాలను, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు కీర్తి తెచ్చిన సాయి ప్రవల్లిక ప్రతిభను ముఖ్యమంత్రి అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి విజయేంద్ర బోయి, టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి (ఎఫ్‌ఏసీ) కంభంపాటి శారద, జాయింట్ సెక్రటరీ (అకాడమిక్) సక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించిన మంత్రి మహమ్మద్ అజారుద్దీన్..

**పెద్ద కలలు కనాలని విద్యార్థులకు పిలుపు**

**హైదరాబాద్, జూలై 18 :**



తెలంగాణ రాష్ట్ర మైనారిటీల సంక్షేమం, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ శనివారం అరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో మమేకమయ్యారు. పాఠశాలలోని విద్యా, వసతి, క్రీడా మౌలిక సదుపాయాలను పరిశీలించిన ఆయన విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడి, ఆటోగ్రాఫ్‌లు ఇచ్చి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పెద్ద కలలు కనాలని, కష్టపడి చదివి క్రమశిక్షణ, అంకితభావంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఆధునిక విద్యా, క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. విజయం సాధించేందుకు అభిరుచి, పట్టుదల, నిరంతర సాధన ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను గౌరవించాలని, సందేహాలు అడగడంలో సంకోచించవద్దని విద్యార్థులకు సూచించారు. అపజయాలను అధిగమిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, చదువు, క్రీడలు లేదా ఏ రంగంలోనైనా అత్యున్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రసంగం అనంతరం మంత్రి విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడి బ్యాటింగ్, ఫీల్డింగ్‌కు సంబంధించిన సూచనలు అందించారు. ఆయనతో ఫోటోలు దిగుతూ, ఆటోగ్రాఫ్‌లు తీసుకున్న విద్యార్థులు ఈ సందర్శన తమకు స్ఫూర్తినిచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు.

# రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేయాలి

**జిల్లా పౌర సరఫరాల అధికారి వి. బాలరాజు**

**నారాయణపేట, జూలై,18**

నారాయణపేట, జూలై 18: జిల్లాలోని అన్ని రేషన్ కార్డుదారులు తమ రేషన్ కార్డులకు సంబంధించి ఈ–కేవైసీ (e-KYC) ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా తప్పనిసరిగా పూర్తి చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి వి. బాలరాజు తెలిపారు.రేషన్ కార్డులో నమోదైన ప్రతి సభ్యుడు తప్పనిసరిగా సమీపంలోని చౌకధరల దుకాణానికి వెళ్లి ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ధృవీకరణ ద్వారా ఈ–కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులోగా ఈ–కేవైసీ పూర్తి చేయని సభ్యులకు భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రేషన్ సేవల కొనసాగింపులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు.వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు లేదా ఇతర కారణాల వల్ల స్వయంగా చౌకధరల దుకాణానికి హాజరు కాలేని వారి వివరాలను సంబంధిత చౌకధరల దుకాణ డీలర్‌కు ముందస్తుగా తెలియజేయాలని సూచించారు. అలాంటి అర్హుల కోసం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతుందని తెలిపారు. జిల్లాలోని రేషన్ కార్డుదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా ఈ–కేవైసీ ప్రక్రియను పూర్తి చేసి ప్రభుత్వ సేవలను నిరంతరాయంగా పొందాలని జిల్లా పౌర సరఫరాల అధికారి వి. బాలరాజు విజ్ఞప్తి చేశారు.

# తాండూరులో రూ.290 కోట్ల రోడ్ల పనులకు శంకుస్థాపన

- **వికారాబాద్ జిల్లాకు రూ.900 కోట్ల రోడ్ల నిధులు: మంత్రి కోమటిరెడ్డి**

**తాండూర్, జూలై 18 :**




వికారాబాద్ జిల్లాలో రోడ్ల అభివృద్ధికి రూ.900 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. శనివారం తాండూర్ నియోజకవర్గంలో రూ.290 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రోడ్ల నిర్మాణ, బలోపేత పనులకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తదితరులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తున్నామని, మెరుగైన రవాణా సౌకర్యాలతో పరిశ్రమలు, వ్యాపారాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ప్రజాపాలనలో భాగంగా 30 నెలల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, సన్నబియ్యం, రూ.500 సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు, మహిళా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని చెప్పారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లోనే రూ.900 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. కోర్టు కేసు పరిష్కారమైన వెంటనే రూ.94 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని 18 వారాల్లో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో యంగ్ ఇండియా పాఠశాలలను ఏర్పాటు చేసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఆర్థిక క్రమశిక్షణతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రధాన రహదారుల నిర్మాణం, కాగ్నా నదిలో మురుగునీరు కలవకుండా రూ.30 కోట్లతో పనులు ప్రారంభించామని తెలిపారు. రైతు రుణమాఫీ, ఉద్యోగ నియామకాలు, విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలు, తాండూర్‌లో 571 మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయించిందన్నారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తాండూర్ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు తీసుకొస్తున్నామని, మైనార్టీ సంక్షేమం, వైద్య, విద్యా రంగాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

# మహిళల సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎంపీ కడియం కావ్య

**హైదరాబాద్, జూలై 18**

మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబనకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. హైదరాబాద్‌లో టీఎస్‌ఐసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైజ్ హర్–2026 మహిళా సాధికారత సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు ఆత్మవిశ్వాసంతో విద్య, ఉద్యోగం, వ్యాపారం, నాయకత్వ రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సూచించిన "పే బ్యాక్ టు సొసైటీ" భావనను ఆచరించాలని, మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్వయం సహాయక సంఘాల బలోపేతం ద్వారా మహిళల్లో పొదుపు, స్వయం ఉపాధి, పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, వివిధ శాఖల అధికారులు, బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

# క్రైస్తవ మైనారిటీల పథకాల దరఖాస్తు గడువు జూలై 31 వరకు

**జగిత్యాల, జూలై 18 :**

తెలంగాణ ప్రభుత్వం క్రైస్తవ మైనారిటీల కోసం అమలు చేస్తున్న కుట్టు మిషన్లు, రూ.50 వేల ఆర్థిక సహాయం, డ్రైవర్ సాధికారత పథకాల ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును జూలై 31, 2026 వరకు పొడిగించినట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ అధికారి కే.వై. ప్రసాద్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు https://tgobmms.cgg.gov.in/ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 040-29801130, 040-23391067 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# టీఎస్ ఎస్సీ స్టడీ సర్కిల్ "విజయగాథలు" పుస్తకావిష్కరణ



**కామారెడ్డి, జూలై 18**

: టీఎస్ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొంది పోటీ పరీక్షల్లో విజయం సాధించిన అభ్యర్థుల స్ఫూర్తిదాయక కథనాలతో రూపొందించిన "విజయగాథలు" పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ షాంగ్వాన్ శనివారం కామారెడ్డి కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, డిప్యూటీ కలెక్టర్ రవితేజ, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి పి. వెంకటేష్, నిజామాబాద్ జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ పుస్తకం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని అధికారులు తెలిపారు.

# పురాతన, వారసత్వ సంపదకు నిలయం మెదక్ జిల్లా: మంచు విష్ణు

**మెదక్, జూలై 18**



పర్యాటక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లాను సందర్శించిన సినీ నటుడు, మా అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణుకు జిల్లా యంత్రాంగం ఘన స్వాగతం పలికింది. ఏడుపాయల వనదుర్గ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, అనంతరం మెదక్ ఖిల్లా, సీఎస్ఐ కేథడ్రల్ చర్చిని సందర్శించారు. మీడియాతో మాట్లాడుతూ మెదక్ జిల్లా పురాతన, వారసత్వ సంపదకు నిలయమని, ఇక్కడి చారిత్రక, పర్యాటక ప్రాంతాలను పరిరక్షించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో తాను నటించే లేదా నిర్మించే చిత్రాల్లో మెదక్‌లో చిత్రీకరణకు అవకాశం కల్పిస్తానని తెలిపారు.

# విక్రమ్-1 ప్రయోగానికి ప్రధాని మోదీ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ, జూలై 18 :**

భారత తొలి ప్రైవేట్ కక్ష్య ప్రయోగ వాహనం విక్రమ్–1 తొలి ప్రయోగం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రయోగం భారత అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని పేర్కొన్నారు. నాలుగు దశలతో రూపొందించిన విక్రమ్–1 రాకెట్ వేగవంతమైన, అవసరానుసార ఉపగ్రహ ప్రయోగ సేవలను అందించేలా రూపకల్పన చేసినట్లు తెలిపారు. అంతరిక్ష రంగంలో చేపట్టిన సంస్కరణల ఫలితంగానే ఇటువంటి వినూత్న విజయాలు సాధ్యమవుతున్నాయని చెప్పారు. ఉదయం 11:30 గంటలకు జరగనున్న ఈ చారిత్రక ప్రయోగాన్ని ముఖ్యంగా యువత వీక్షించాలని ప్రధాని పిలుపునిచ్చారు. #IndiaWithVikram1 హ్యాష్‌ట్యాగ్‌తో స్కైరూట్ బృందానికి శుభాకాంక్షలు తెలియజేయాలని ఆయన కోరారు.

# బల్కంపేట ఎల్లమ్మ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: తలసాని




**హైదరాబాద్, జూలై 18**

: ఈ నెల 21న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం, 22న రథోత్సవం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు బందోబస్తు, బారికేడ్లు, సీసీ కెమెరాలు, ప్రత్యేక హెల్త్ క్యాంపులు, వాలంటీర్లకు గుర్తింపు కార్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రస్తుతం ఎల్లమ్మ కళ్యాణానికి 7–8 లక్షల మంది భక్తులు హాజరవుతున్నందున అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## 'మై భారత్ – విక్షత్ భారత్ రిజిస్ట్రేషన్ డ్రైవ్' పోస్టర్‌ను ప్రారంభించారు

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ



**వికారాబాద్, జులై,17**

వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ బుధవారం కలెక్టరేట్‌లో 'మై భారత్ – విక్షత్ భారత్ ఇంటెన్సివ్ యూత్ రిజిస్ట్రేషన్ & అవేర్‌నెస్ డ్రైవ్' పోస్టర్‌ను అధికారికంగా ప్రారంభించారు.అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట చారి, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్‌డిఓ) వాసు చంద్ర, ట్రైనీ కలెక్టర్ సచిన్ బసవరాజ్ గట్టు, వికారాబాద్ జిల్లా 'మై భారత్' డిప్యూటీ డైరెక్టర్ స్నేహల్ బసుత్కర్, మరియు 'మై భారత్' సిబ్బంది సభ్యుడు శ్రీశైలం యాదవ్ సమక్షంలో ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వికారాబాద్ జిల్లా యువత 'మై భారత్' పోర్టల్‌లో నమోదు చేసుకుని, దేశ నిర్మాణం, స్వచ్ఛంద సేవ, నైపుణ్యాభివృద్ధి, మరియు యువత భాగస్వామ్య కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. 'విక్షత్ భారత్' దార్శనికతకు దోహదపడే అర్థవంతమైన అవకాశాలతో యువతను అనుసంధానించడమే ఈ రిజిస్ట్రేషన్ డ్రైవ్ లక్ష్యమని ఆయన చెప్పారు.జిల్లా వ్యాప్తంగా నమోదు మరియు అవగాహన కార్యక్రమాన్ని ఘన విజయం సాధించేందుకు విద్యాసంస్థలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద కార్యకర్తలు తమ మద్దతును అందించాలని అధికారులు ప్రోత్సహించారు.

## ఫైనాన్స్ సంస్థలు,జ్యువెలరీ దుకాణాల్లో భద్రతా ఏర్పాట్ల పరిశీలన



**మరిపెడ,జూలై17 :**

మరిపెడ పట్టణంలోని ఫైనాన్షియల్ సంస్థలు,పాన్ బ్రోకర్స్,జ్యువెలరీ షాపుల్లో భద్రతా ఏర్పాట్లను శుక్రవారం మరిపెడ ఎస్సైలు గండ్రాతి సతీష్, ప్రభాకర్ రెడ్డి పరిశీలించారు.ముతూట్, ఎల్ఎల్ఎఫ్ఎల్,కీర్తనే,శ్రీరామ్ ఫైనాన్స్ శాఖలతో పాటు పలు బంగారు ఆభరణాల దుకాణాలను సందర్శించి, కార్యాలయాల్లో అమలులో ఉన్న భద్రతా ప్రమాణాలు,అలారం వ్యవస్థలు, సీసీ కెమెరాల పనితీరు,కవరేజ్‌ను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయా సంస్థల బ్రాంచ్ మేనేజర్లతో మాట్లాడి భద్రతాచర్యల పైవివరాలుతెలుసుకున్నారు.గోల్డ్ లోన్ మంజూరు చేసే సమయంలో రుణగ్రహీతల పూర్తి వివరాలు,గుర్తింపు పత్రాలు,బంగారు ఆభరణాల వివరాలను క్షుణ్ణంగా ధృవీకరించాలని సూచించారు. అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తులు లేదా లావాదేవీలు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆదేశించారు.ఇటీవల కరీంనగర్‌లోని జ్యువెలరీ షాపులో జరిగిన ఘటనల వంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్సైలు తెలిపారు.వ్యాపార సంస్థలు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ పోలీసులతో సమన్వయంగా పనిచేయాలని సూచించారు.

## టీలావత్ తండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం



**మరిపెడ,జూలై17**

మహబూబాబాద్ జిల్లామరిపెడ మండలం గాలివారిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని టీలావత్ తండాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ నారెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..గ్రామ ప్రజలకు మెరుగైన రహదారిసౌకర్యాలుకల్పించడం గ్రామపంచాయతీ లక్ష్యమని,తండాలో రాకపోకలు సులభతరం కావడానికి ఈ సీసీ రోడ్డు ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బల్లెం ఎల్లయ్య, గ్రామకార్యదర్శి,ఎల్లబోయిన సోమయ్య,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు,తండావాసులుపాల్గొన్నారు.గ్రామాభివృద్ధికిఅందరూసహకరించాలని సర్పంచ్ కోరారు.

## రేషన్ కార్డుదారులు జూలై 31లోగా ఈ-కేవైసీ పూర్తి చేయాలి

**ఖమ్మం, జూలై 17**

జిల్లాలోని రేషన్ కార్డుదారులు రేషన్ కార్డులో నమోదైన ప్రతి కుటుంబ సభ్యుడు తమకు కేటాయించిన చౌక ధరల దుకాణానికి వెళ్లి జూలై 31లోగా బయోమెట్రిక్ ఈ–కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున బాబు సూచించారు. కొన్ని రేషన్ కార్డుల్లో ఒకరు లేదా ఇద్దరు సభ్యులు మాత్రమే ఈ–కేవైసీ పూర్తి చేయగా, మిగిలిన వారు ఇంకా చేయించుకోలేదని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిరంతరాయంగా అందాలంటే ప్రతి కుటుంబ సభ్యుడి ఈ–కేవైసీ తప్పనిసరి అని పేర్కొన్నారు. సందేహాలు ఉంటే సంబంధిత చౌక ధరల దుకాణం లేదా మండల పౌర సరఫరాల అధికారులను సంప్రదించాలని సూచించారు.

# మూడ్ మల్ మెగాలిథిక్ మెన్హిర్ సైట్ అభివృద్ధికి చర్యలు

- **జిల్లా కలెక్టర్ తో దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ భేటీ.**

**నారాయణపేట, జులై,17**



నారాయణ పేట జిల్లా కృష్ణా మండలంలోని మూడ్ మల్ బృహత్ శిలా ఫలకాల (మెగాలిథిక్ మెన్హిర్) ప్రదేశానికి సంబంధించిన సర్వే నంబర్ల పరిధిలో ఉన్న మొత్తం ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక తహసీల్దార్‌ను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేద కుమార్, హెరిటేజ్ తెలంగాణ కార్యాలయ విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ నాగ లక్ష్మీ బృందం కలెక్టర్ ప్రియాంకతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేద కుమార్ ముడుమల్ నిలువు రాళ్లకు యునెస్కో గుర్తింపు కోసం ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చోటు దక్కడం తెలంగాణకు గర్వకారణం అని, యూనెస్కో శాశ్వత గుర్తింపు కోసం ప్రభుత్వం కృషి చేస్తోందనీ, నిలువురాళ్ల ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ కు వివరించారు. ఇది వరకు ఇక్కడ ఉన్న కలెక్టర్లు నిలువు రాళ్ల పరిరక్షణ కోసం అవసరమైన చర్యలు చేపట్టారని తెలిపారు. నిలువు రాళ్ల ప్రదేశం గుండా వెళ్తున్న విద్యుత్ గ్రిడ్ లైన్‌ను తరలించే అంశంపై వారు కలెక్టర్ తో చర్చించారు.ఈ విషయమై సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డిప్యూటీ కలెక్టర్ ఫణి కుమార్, విద్యుత్ శాఖ ఎస్ ఈ నవీన్, డీ ఈ ఓ గోవింద రాజులు, ఆర్ అండ్ బీ ఈ ఈ వెంకట రమణ, సర్వే ల్యాండ్ ఏ డీ వేణు గోపాల్, పీ ఆర్ ఈ ఈ అశోక్, డీ పీ ఆర్ వో రషీద్, హెరిటేజ్ విభాగ ఏ ఈ నరేష్, మూడ్ మల్ సర్పంచి బాల్ రాజ్ పాల్గొన్నారు.

# పీహెచ్‌సీలో బదిలీ సిబ్బందికి ఘన వీడ్కోలు

**మరిపెడ,జూలై17 :**



మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్‌సీలో సుదీర్ఘకాలంగా ప్రజారోగ్య సేవల్లో విశిష్ట సేవలందించి బదిలీపై వెళ్తున్న వివిధ విభాగాల సిబ్బందికి శుక్రవారం ఘన వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డీఎంహెచ్‌వో డాక్టర్ భూక్యా రవి రాథోడ్,డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న సిబ్బందిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానిం చారు.అనంతరం డీఎంహెచ్‌వో మాట్లా డుతూ ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడంలో బదిలీ అయిన సిబ్బంది కీలక పాత్ర పోషించారని కొనియాడారు.దశాబ్దాల పా టు ప్రజలకు అంకితభావంతో సేవలందించిన వారి కృషి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టనున్న ప్రాంతాల్లో కూడా ఇదే నిబద్ధతతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.సుదీర్ఘ సేవల అనంతరం బదిలీ అయిన వారిలో బి. విజయకు మారి, సిహెచ్. సరళ, మోహినమ్మ, వెంకటేశ్వర్లు, చంద్రకళ,ఏబీటీ సుందరి, నర్సబాయి, ఆర్.పద్మ, ఫెరోజ్,సీనియర్ అసిస్టెంట్ ఎస్. రవిచంద్ర,ఎంఎల్‌హెచ్‌పీ సాయిశ్రీ, ఉన్నారు.ఈకార్యక్రమంలో డాక్టర్ పూజిత, డాక్టర్ స్వామి,డాక్టర్ కిరణ్ సాగర్, పీహెచ్‌ఎన్‌వో మంగమ్మ, హెల్త్ సూపర్వైజర్లు ఆచార్యులు,మాధవి, లలిత కుమారి,పల్లె దవాఖానా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా ఆరోగ్య కార్యకర్తలు,ఆసుపత్రి సిబ్బంది పాల్గొని బదిలీ అయిన ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు.

# హిట్ అండ్ రన్ కేసులో నిందితుడిని పట్టుకోవాలి

- **మృతుడు బానోత్ యాకుబ్ కుటుంబ సభ్యుల ఆందోళన – పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా, జాతీయ రహదారిపై రాస్తారోకో**

**ఆలేరు, జూలై 17 :**



ఆలేరు బైపాస్‌లో జరిగిన హిట్ అండ్ రన్ రోడ్డు ప్రమాదంలో నర్మేట మండలం మల్కాపేట గ్రామానికి చెందిన బానోత్ యాకుబ్ (50) మృతి చెందిన ఘటనలో ఇప్పటివరకు ప్రమాదానికి కారణమైన వాహనం, డ్రైవర్‌ను గుర్తించడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు శుక్రవారం ఆలేరు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం హైదరాబాద్, వరంగల్ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, యాకుబ్ చిరు వ్యాపారం నిర్వహిస్తూ హైదరాబాద్‌కు వెళ్తున్న సమయంలో ఆలేరు బైపాస్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం జరిగి 24 గంటలు గడిచినా ప్రమాదానికి కారణమైన వ్యక్తిని గుర్తించడంలో పోలీసులు ఎలాంటి పురోగతి సాధించలేదని వారు ఆరోపించారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే నిందితుడు ఇంకా బయట తిరుగుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు, పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టి కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించారు. ప్రమాదానికి కారణమైన వాహనం, డ్రైవర్‌ను వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. మృతుడు యాకుబ్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని, కుటుంబానికి ఆయనే ప్రధాన ఆధారమని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన నేపథ్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రమాదానికి కారణమైన వాహనం, నిందితుడిని గుర్తించేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలోనే కేసును ఛేదిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# చేనేత సహకార సంఘం నూతన పాలకవర్గానికి ఘన సన్మానం



పాలకవర్గానికి సన్మానం చేస్తున్న సంఘ సభ్యులు

**ఆలేరు, జూలై 17 :**

ఆలేరు చేనేత పారిశ్రామిక సహకార సంఘం నూతన పాలకవర్గాన్ని క్రాంతినగర్ చేనేత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఇటీవల ఆలేరు చేనేత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన దాసి శంకర్, ఉపాధ్యక్షుడు చింతకింది రంగ, కార్యదర్శి గాడిపల్లి రమేష్, ఆలేరు మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు చింతకింది మురళిలను శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు చేనేత ప్రముఖులు మాట్లాడుతూ నూతన పాలకవర్గం చేనేత కార్మికుల సంక్షేమం, సంఘం అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సభ్యులకు చేరవేయడంలో ముందుండాలని ఆకాంక్షించారు. చేనేత రంగానికి మరింత ప్రోత్సాహం లభించేలా కృషి చేయాలని కోరారు. సన్మానానికి స్పందించిన సంఘం అధ్యక్షుడు దాసి శంకర్ మాట్లాడుతూ సభ్యుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం, సంఘం బలోపేతం, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. అందరి సహకారంతో సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చింతకింది వెంకటయ్య, రచ్చ హనుమంతు, ముసునూరి శ్రీనివాస్, మైలబోయిన శ్రీధర్, చింతకింది మార్కండేయ, గుండ్ల శ్రీనివాస్, చింతకింది సిద్దేశ్వర్, శ్రీరాముల శ్రీనివాసు, అంబటి చంద్రమౌళి, రచ్చ సత్తయ్య, పసునూరి యాదగిరి, కుడికాల సత్యనారాయణ, చింతకింది సిద్ధులు, దుస్స విట్టల్, వంగ నరసింహులు, రచ్చ వెంకటేష్, రేగొట్టి వెంకటేష్, బేతి సత్యం, ఎలగందుల కుమార్, చింతకింది ఉమేష్, జిల్లా యాదగిరి, జోగు నరసింహులు, గంజి పరమేష్, గణపురం లక్ష్మణ్, బిర్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎన్ లినో ప్రభావం.. ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

**మెదక్, జూలై 17**




ఎన్ లినో ప్రభావంతో తక్కువ వర్షపాతం, నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు వరికి బదులుగా తక్కువ నీటి వినియోగంతో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ మిల్లెట్స్, పప్పుధాన్యాలు, కూరగాయలు, పామాయిల్ వంటి పంటలను ప్రోత్సహించాలని సూచించారు. బోరు బావులపై ఆధారపడి వరి సాగు చేయవద్దని, భవిష్యత్తులో భూగర్భ జలాలు తగ్గి పంట నష్టం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పర్యటించి రైతులకు పంటల ఎంపికపై అవగాహన కల్పించాలని, బిందు, తుంపర్ల సేద్యం వంటి నీటి పొదుపు పద్ధతులను ప్రోత్సహించాలని ఆదేశించారు. కూరగాయల సాగుకు ప్రభుత్వం ఎకరాకు రూ.9,600 ప్రోత్సాహకం అందిస్తోందని తెలిపారు. అలాగే జిల్లా కంటింజెన్సీ ప్రణాళికను సిద్ధం చేయాలని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు.

# ఆలేరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన కార్యవర్గ తొలి సమావేశం

- పాల్గొన్న సభ్యులకు సంఘ కార్యదర్శి హృదయపూర్వక కృతజ్ఞతలు

**ఆలేరు, జూలై 18 :**



ఆలేరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శనివారం నూతనంగా నామినేట్ చేయబడిన కార్యవర్గ సభ్యుల తొలి సమావేశం విజయవంతంగా నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్ జనగాం ఉపేందర్ రెడ్డి అధ్యక్షత వహించగా, కార్యవర్గ సభ్యులు మోర్తల మోహన్ రెడ్డి, బండ వీరమల్లయ్య, మాలోతు శ్రీను నాయక్, బీసు నరహరి, చెక్క వెంకటేశ్, చాడ రాజు, బొమ్మకంటి లక్ష్మీనారాయణ, సుక్క యాదమ్మ, ఆలకుంట్ల స్వరూప, వట్టిపల్లి శ్రీనివాస్, జన్నె బిక్షపతి, సందేపల్లి ముత్తయ్య సమావేశానికి హాజరై సంఘ అభివృద్ధి, రైతు సంక్షేమం, భవిష్యత్ కార్యాచరణపై తమ విలువైన సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యుడు బీర్ల ఐలయ్య మార్గదర్శకత్వం సహకారంతో నూతన నామినేట్ కార్యవర్గం ఏర్పాటుకు తోడ్పాటునందించినందుకు సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సమావేశానికి హాజరైన జిల్లా సహకార అభివృద్ధి బ్యాంకు మేనేజర్ ఆర్ కావ్య, ఫీల్డ్ ఆఫీసర్ ఈ కోటి రెడ్డి, రైతు ఉత్పత్తిదారుల సంస్థ డొమైన్ నిపుణుడు జె పాండరి అందించిన విలువైన సూచనలు, సహకారానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులందరి సమిష్టి సహకారంతో సంఘ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు కృషి చేస్తామని సంఘ కార్యదర్శి తెలిపారు.

# అక్రమ మద్యం విక్రయ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలి

## బెల్ట్ షాపులను వెంటనే తొలగించాలని బీజేపీ వినతి

**ఆలేరు, జూలై 18 :**



ప్రభుత్వ అనుమతి లేకుండా గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం విక్రయ కేంద్రాలు, బెల్ట్ షాపులను వెంటనే తొలగించి నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ ఆలేరు మండల శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఆలేరు పోలీస్ స్టేషన్‌లో సీఐ యాలాద్రికి, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎస్సై పి నిరోషకు బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు పూజారి కుమారస్వామి గౌడ్ మాట్లాడుతూ, మండలంలోని అనేక గ్రామాల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా మద్యం విక్రయ కేంద్రాలు నిర్వహిస్తూ విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడంతో అక్రమ వ్యాపారం రోజురోజుకూ పెరుగుతోందని అన్నారు. బెల్ట్ షాపులు బార్లను తలపించేలా మారి మద్యం సేవించే వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారని, 21 సంవత్సరాల లోపు యువతకు కూడా చట్టవిరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల యువత మద్యానికి, మాదకద్రవ్యాలకు బానిసై అసాంఘిక కార్యకలాపాల వైపు మళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో రోడ్లపై, విద్యాసంస్థల పరిసరాల్లో మద్యం సేవించి మద్యం సీసాలను పగులగొట్టడం వల్ల ప్రజలు, ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అక్రమ మద్యం విక్రయ కేంద్రాల నిర్వాహకులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ మద్యం విక్రయాలను అరికట్టడంలో అధికారులు విఫలమైతే రానున్న రోజుల్లో బీజేపీ ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యపరుస్తూ సంబంధిత శాఖల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కామిటికారి కృష్ణ, కార్యవర్గ సభ్యులు సూదగాని రాజు, కటకం వెంకటేష్, ప్రధాన కార్యదర్శులు అంకిరెడ్డి శ్రీనివాస్, శేషత్వం అమరేందర్, ఏలగల వెంకటేష్, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరిండ్ల లక్ష్మి, శేషత్వం అర్చన, జిల్లా నాయకులు కళ్ళెపు యాదగిరి, తెరాల శంకర్, బైరి మహేందర్, నరసింహులు, సురేష్, వెంకటేష్, కుమార్, కాంద్రాజు శ్రీనివాస్, మిట్టపల్లి భాస్కర్, వడ్డేపల్లి కిషన్, కాంతి రవి, కోల నరేష్, సాయిప్రసాద్, గడ్డం సందీప్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ నినో (ELNINO) ఎఫెక్ట్ పై రైతులకు అవగాహన-ఏ.వో తులసి దౌల్తాబాద్

**దౌల్తాబాద్ మండలం, జులై,18**




దౌల్తాబాద్ :వరి పంటలో ఆల్టర్నేట్ వెట్టింగ్ అండ్ డ్రైయింగ్ (AWD) పద్ధతి గురించి WASAN Foundation వారి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించాం.దౌల్తాబాద్ ఎవో తులసి మాట్లాడుతూ.... వరి పొలంలో ఎల్లప్పుడూ నీరు నిల్వ ఉంచకుండా, అవసరమైన సమయంలో మాత్రమే నీరు పెట్టి, మధ్యలో నేల కొంతకాలం తడిగా–పొడిగా మారేలా నిర్వహించే శాస్త్రీయ నీటి యాజమాన్య పద్ధతిని AWD (Alternate Wetting and Drying) వివరించాము. దీని వల్ల నీరు ఆదా అవుతుంది, దిగుబడి తగ్గకుండా ఉంటుంది.ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షపాతం లోపించే అవకాశం ఉన్న నేపథ్యంలో, రైతు వేదిక చెల్లాపూర్ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది

★ రైతులకు ప్రస్తుత వర్షపాత పరిస్థితి, నీటిపారుదల వనరుల లభ్యత, బోర్‌వెల్ నీటి పరిస్థితిపై అవగాహన కల్పించబడింది

★ తగినంత నీటి వనరులు ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే పంటలు విత్తాలని రైతులకు సలహా ఇవ్వడం జరిగింది

★ తగినంత వర్షపాతం లేదా నీటిపారుదల అందుబాటులో లేకపోతే పంటలు వేయవద్దని రైతులకు స్పష్టంగా సూచించడం జరిగింది

★ రైతులు పంట వేయాలనే పట్టుదలతో ఉంటే, తక్కువ నీటితో సాగు చేయగల మెట్ట పంటలను ఎంచుకునేలా మార్గనిర్దేశం చేసాము

**ఈ క్రింది అత్యవసర నిర్వహణ చర్యలు రైతులకు తెలియజేయడం జరిగింది**

1. కలుపు మొక్కల నివారణకలుపు మొక్కలు నీటిని ఎక్కువగా వినియోగిస్తాయి.వెంటనే తొలగించి తేమను సంరక్షించాలి.
2. మల్చింగ్ చేయాలి గడ్డి లేదా పంట అవశేషాలతో నేలను కప్పి తేమ ఆవిరైపోకుండా చూడాలి.
3. రక్షణాత్మక నీటిపారుదల (Life-saving Irrigation)నీరు అందుబాటులో ఉంటే కీలక దశల్లో మాత్రమే తక్కువ మోతాదులో నీటిని అందించాలి.
4. ఆకులపై పోషక ద్రావణాల పిచికారీవ్యవసాయ అధికారుల సూచనల మేరకు 2% యూరియా లేదా 1% పొటాషియం నైట్రేట్ (KNO□) ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
5. నేలను తేలికగా దున్నడం (Intercultivation)నేలపై ఏర్పడిన గట్టి పొరను తొలగించి తేమ నిల్వ ఉండేలా చూడాలి.
6. వర్షపు నీటి సంరక్షణగట్లు, చిన్న కాలువలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని పొలంలో నిల్వ చేయాలి.
7. వరి సాగును నిరుత్సాహపరచాలినీటి కొరత ఉన్న ప్రాంతాల్లో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పెరిగే పంటలను ప్రోత్సహించాలి.
8. ఐడీ పంటలు (ID Crops) సాగు చేయాలి, తక్కువ నీటి అవసరమున్న పంటలు సాగు చేయడం ద్వారా నీటిని పొదుపు చేసుకోవచ్చు మరియు స్థిరమైన ఆదాయం పొందవచ్చు.(పంటల పేర్లు): జొన్న, సజ్జ, రాగి, పెసర, మినుము, కంది, శనగ.

ఎల్ నినో ELNINO ప్రభావాలు, ప్రమాదాలు మరియు వ్యవసాయ శాఖ సూచనలను సంబంధిత రైతులకు ముందుగానే తెలియజేస్తున్నాము.ఈ కార్యక్రమంలో చల్లాపూర్ గ్రామ సర్పంచ్ రోజా రమేష్, ఈర్లపల్లి గ్రామ సర్పంచ్ పద్మ వెంకటరాములు గ్రామస్తులు విజయకుమార్, పకీరప్ప, శరణయ్య తదితర రైతులు, వాసన్ (NGO) ప్రతినిధులు, వ్యవసాయ మండల వ్యవసాయ అధికారి తులసి విస్తరణ అధికారులు వినోద్ వైష్ణవి జ్యోతి నిఖిల్ లోకేష్ శ్రీదేవి పాల్గొన్నారు.

# బీఎస్‌సీ క్యాడెట్లకు అంతర్జాతీయ సెయిలింగ్‌లో పతకాల పంట

**హైదరాబాద్, జూలై 18**



ఈ నెల 12 నుంచి 18 వరకు జరిగిన తొలి ఇండియా ఇంటర్నేషనల్ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్, 40వ హైదరాబాద్ సెయిలింగ్ వీక్‌లో త్రిష్ణా సెయిలింగ్ క్లబ్‌కు చెందిన బీఎస్‌సీ క్యాడెట్లు ప్రతిభ చాటారు. ఇల్కా–4 విభాగంలో క్యాడెట్ రాహుల్ సోనార్ రజత పతకం సాధించగా, ఇల్కా–6 అండర్–19 విభాగంలో క్యాడెట్ హృతిక్ అమర్ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఆర్మీ భాయ్స్ స్పోర్ట్స్ కంపెనీకి చెందిన ఈ సెయిలర్ల విజయానికి కోచ్ నవీన్ కుమార్ శిక్షణ కీలకమని నిర్వాహకులు తెలిపారు. క్యాడెట్లను క్లబ్ ప్రతినిధులు అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# గోదావరిఖనిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు..

## 25 కిలోల వాడిన వంటనూనె స్వాధీనం

**పెద్దపల్లి, జూలై 18**

గోదావరిఖని పట్టణంలోని రాజీవ్ నగర్‌లో ఉన్న ఓ ఆహార తయారీ యూనిట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఆలుగడ్డ చిప్స్ తయారీలో పదేపదే వినియోగిస్తున్న వంటనూనె నాణ్యత ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్నట్లు టెస్టింగ్‌లో గుర్తించారు. దీంతో సుమారు 25 కిలోల వాడిన వంటనూనెను స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేయడంతో పాటు, ఆ నూనెతో తయారైన చిప్స్‌ను ధ్వంసం చేశారు.వాడిన వంటనూనెను అనధికార వ్యక్తులు లేదా సంస్థలకు విక్రయించరాదని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఆహార నమూనాలను సేకరించి రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపగా, నివేదికల ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వి. అంకిత్ రెడ్డి తెలిపారు.

# నాల్గో వర్డు గుండ్లకుంటలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన

## మున్సిపల్ చెర్మెన్ నందారం ప్రశాంత్



**కొడంగల్ మున్సిపల్, జులై,18**

కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డ్ గుండ్లకుంట గ్రామం లో సీసీ రోడ్డు పనులు కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ చేతుల మీదగా ప్రారంభించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో బాగంగా కో ఆప్షన్ మెంబర్ రమేష్ జి. బాబు మరియు గుండ్లకుంట కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వి చంద్రప్ప,మొగలప్ప,జీ చందు,తదితర కార్యకర్తలు పనినిర్వాహకులు,తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ నినోపై గ్రామాల్లో అవగాహన కల్పించాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, జూలై 18**

వచ్చేవారం నుంచి గ్రామ సభలు నిర్వహించి ఎల్ నినో పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈనెల 19న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో వ్యవసాయ, భూగర్భజల శాఖ అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎల్ నినో ప్రభావం, లోటు వర్షపాతం, పంటల సాగు, భూగర్భజలాలు, వాతావరణ పరిస్థితులపై మండలాల వారీగా సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ఆరుతడి పంటలు, కూరగాయల సాగును ప్రోత్సహించి, రైతులకు ప్రభుత్వ రాయితీ పథకాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. నీటిపారుదల, విద్యుత్, రెవెన్యూ, పంచాయతీ శాఖలతో సమన్వయం చేసి రైతులకు నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

# బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం పంపిణీ

## బియ్యం అందజేస్తున్న వార్డు సభ్యుడు



**ఆలేరు, జూలై 18 :**

ఆలేరు మండలం టంగుటూరు గ్రామానికి చెందిన దొంతిరి వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుటుంబ సభ్యులను 7వ వార్డు సభ్యుడు కళ్లేపు మధుసూదన్ పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారికి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా నిలుస్తూ రూ. అవసరాల కోసం 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఇలాంటి క్లిష్ట సమయంలో గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబాలకు అండగా ఉండటం సామాజిక బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు చూపిన ఆప్యాయతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళ్లేపు చంద్రయ్య, ముదిగొండ లక్ష్మయ్య, భూపెల్లి కేశవులు, దొంతిరి రవీందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, గణపురం నర్సింహులు, ఎలగందుల సిద్దులు, దూడల ఉప్పలయ్య, నీల రాఘవులు, చింతకింది రవిశంకర్, అంబల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల సమావేశం



**మరిపెడ,జూలై18:**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జెడ్పీహెచ్ఎస్ మరిపెడలో శనివారం తల్లిదండ్రుల–ఉపాధ్యాయుల సమావేశం విజయవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇ. అనంతరావు సమావేశానికి హాజరైన తల్లిదండ్రులను పుష్పగుచ్ఛాలతో ఆత్మీయంగా స్వాగతించారు.

సమావేశంలో విద్యార్థుల నిత్య హాజరు, విద్యా ప్రగతి,అభ్యాస నైపుణ్యాల పెంపు, క్రమశిక్షణ తదితర అంశాలపై తల్లిదండ్రులతో విస్తృతంగా చర్చించారు.ప్రతి విద్యార్థి ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని, ఇంటి వద్ద చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించి హోంవర్క్‌ను క్రమం తప్పకుండా పూర్తి చేయించే బాధ్యత తల్లిదండ్రులదేననిప్రధానోపాధ్యాయులు సూచించారు.అనంతరం ప్రతి తల్లిదండ్రితో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేయడంతో పాటు,పిల్లల విద్యాభివృద్ధికి అవసరమైన సూచనలు అందించారు. స్టాఫ్ సెక్రటరీ బయగాని రామ్మోహన్ మాట్లాడుతూ,విద్యార్థుల అభివృద్ధికి తల్లిదండ్రులు పాటించాల్సిన ఆరు వాగ్దానాలనువివరించారు.పాఠశాల–తల్లిదండ్రులసమన్వయంతోనే విద్యార్థులు విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించగలరని ఆయన పేర్కొన్నారు.

కార్యక్రమంలోపాఠశాలఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## పశ్చిమ బెంగాల్‌లో ఘోర రైలు ప్రమాదం.. ముగ్గురు మృతి

**కొల్‌కతా, జూలై 17**

పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో శుక్రవారం విషాదకర రైలు ప్రమాదం జరిగింది. రైల్వే క్రాసింగ్ వద్ద స్కూల్ వ్యాన్‌ను ప్యాసింజర్ రైలు ఢీకొనడంతో ఇద్దరు స్కూల్ విద్యార్థులు సహా ముగ్గురు మృతి చెందారు. మరో ఐదుగురు విద్యార్థులు గాయపడ్డారు. రైల్వే గేటు తెరిచి ఉండటమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక సమాచారం. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలి: టీడీపీ



**హైదరాబాద్, జూలై 17**

మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని తెలంగాణ తెలుగు దేశం పార్టీ పిలుపునిచ్చింది. డ్రగ్స్ కారణంగా యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని, కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈగల్ (EAGLE)–2025 గణాంకాల ప్రకారం డ్రగ్స్ బాధితుల్లో 18–25 ఏళ్ల యువత 39.4 శాతం, 26–35 ఏళ్ల వారు 26.4 శాతం ఉన్నారని, మొత్తం బాధితుల్లో 35 ఏళ్లలోపు వారు 65 శాతానికి పైగా ఉన్నారని తెలిపింది. డ్రగ్స్‌పై విస్తృత అవగాహన కల్పించి, యువతను ఈ వ్యసనానికి దూరంగా ఉంచేందుకు సమాజమంతా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పార్టీ పేర్కొంది.

## శ్రీరంగం నుంచి తిరుమల శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ



**తిరుమల, జూలై 17**

ఆణివార ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని తమిళనాడులోని శ్రీరంగం శ్రీ రంగనాథస్వామి దేవస్థానం తరఫున తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారికి శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీవారి సారెకు పెద్ద జీయర్ మఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, తమిళనాడు దేవాదాయ శాఖ మంత్రి రమేష్, కమిషనర్ వినయ్ తదితరులు మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా పట్టువస్త్రాలను ఆలయానికి తీసుకెళ్లి స్వామివారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, తమిళనాడు దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ రవిచంద్ర, శ్రీరంగం ఆలయ ఈవో శివరామ్ కుమార్, ప్రధాన అర్చకులు సుందర బట్టర్ తదితరులు పాల్గొన్నారు.

## హైటెక్ సిటీ అమృత్ స్టేషన్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ




**హైదరాబాద్, జూలై 17**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశంలోని 20 రాష్ట్రాల్లో పునరాభివృద్ధి చేసిన 75 అమృత్ రైల్వే స్టేషన్లను ప్రారంభించారు. వీటిలో తెలంగాణలోని హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ కూడా ఉంది. హైటెక్ సిటీ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎ.వి.ఎన్. రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, సికింద్రాబాద్ డీఆర్‌ఎం డా. ఆర్. గోపాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద హైటెక్ సిటీ స్టేషన్‌ను ఆధునిక ప్రయాణికుల సౌకర్యాలతో పునరాభివృద్ధి చేశారు. కొత్త స్టేషన్ భవనం, విశాలమైన వెయిటింగ్ హాల్స్, లిఫ్టులు, ఎస్కలేటర్లు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు, మెరుగైన సైనేజీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ హర్యానాలో జింద్–సోనిపత్ మధ్య దేశంలోని తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలును కూడా జెండా ఊపి ప్రారంభించారు. కాలుష్య రహిత రవాణా దిశగా ఇది 'మేక్ ఇన్ ఇండియా'కి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

# ఎమ్మెల్యేపై వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి

- **ప్రజా సమస్యలపై రాజకీయంగా స్పందించాలి: నిరాధార ఆరోపణలు సరికావు: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గందమల్ల అశోక్**



**ఆలేరు, జూలై 17 :**

ప్రజలకు సేవ చేస్తున్న ప్రజాప్రతినిధులపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం, వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని కాంగ్రెస్ పార్టీ ఆలేరు మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ గందమల్ల అశోక్ అన్నారు. శుక్రవారం ఆలేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై ఇటీవల చేసిన వ్యక్తిగత విమర్శలను తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రభుత్వ విధానాలు, ప్రజా సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలకు రాజకీయంగా సమాధానం చెప్పాల్సింది పోయి వ్యక్తిగత స్థాయిలో విమర్శలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. ముఖ్యంగా మండల బీఆర్ఎస్ నాయకుడు కర్రే వెంకటయ్య చేసిన వ్యాఖ్యలు రాజకీయ సంస్కృతికి విరుద్ధమని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కృషి చేస్తున్నారని అశోక్ తెలిపారు. రోడ్లు, తాగునీటి సౌకర్యం, విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనతో పాటు సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పారు. అలాంటి నాయకుడిపై ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఫలించవని స్పష్టం చేశారు. రాజకీయాల్లో విమర్శలు, విభేదాలు సహజమేనని, అయితే అవి వ్యక్తిగత స్థాయికి దిగజారకుండా ప్రజా సమస్యలు, అభివృద్ధి, పాలన అంశాలకే పరిమితం కావాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో పరస్పర గౌరవం పాటించడం ప్రతి రాజకీయ నాయకుడి బాధ్యత అని అన్నారు. ఆరోపణలు చేయాలంటే స్పష్టమైన ఆధారాలతో ప్రజల ముందుకు రావాలని, వ్యక్తిగత దూషణలు, అసభ్యకర వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు.

ఇకపై ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై నిరాధార ఆరోపణలు, అవమానకర వ్యాఖ్యలు కొనసాగితే కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రజాస్వామ్యబద్ధంగా తగిన రీతిలో స్పందిస్తామని గందమల్ల అశోక్ హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కట్టెగొమ్ముల సాగర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ, మున్సిపల్ కౌన్సిలర్ జూకంటి సంపత్, మాజీ పట్టణ అధ్యక్షుడు ఎంఏ ఎజాజ్, మాజీ ఎంపీటీసీ ఆరె ప్రశాంత్, సీనియర్ నాయకులు బీజన భాస్కర్, నీలం వెంకటస్వామి, సర్పంచ్ మోతీలాల్, బుగ్గ నవీన్, యాదగిరి, అందె అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# భూ రీసర్వేకు ఆమోదం తెలపని శిక్షణ సర్వేయర్ల సర్టిఫికెట్ రద్దు చేస్తాం

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ**

**వికారాబాద్, జులై,17**




భూ రీసర్వేకు ఆమోదం తెలపని శిక్షణ సర్వేయర్ల సర్టిఫికెట్ రద్దు చేస్తామని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో భూ రీసర్వేపై శిక్షణ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటివరకు 150 మందికి సర్వే నిర్వాహణపై శిక్షణ ఇచ్చి లైసెన్స్ సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగిందని ఇందులో కొంతమంది భూ రీసర్వేకు ఆమోదం తెలపకుండ ఉన్నారని అట్టి వారి సర్టిఫికెట్ల రద్దుకు ప్రభుత్వానికి సిఫారస్ చేస్తామన్నారు.సంవత్సరాల క్రితం చేపట్టిన భూ సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని భూ రీసర్వేకు లైసెన్స్డ్ సర్వేయర్ల పాత్ర చాలా ముఖ్యమని కలెక్టర్ తెలిపారు.దీర్ఘకాలిక దృక్పథంతో చేపట్టే భూ రీసర్వేకు సర్వేలో పాల్గొనడం ఉత్తమ అవకాశంగా భావించాలని దీనివల్ల అపారమైన అనుభవాన్ని తమ జీవితాల్లో పొందుతారని కలెక్టర్ తెలిపారు.భూ రీసర్వే మూలంగా భూమి రికార్డులు పూర్తి శుద్ధి చేయబడతాయని దీనికి సంబంధిత శాఖల అధికారుల సహకారం తీసుకొని భూ రీ సర్వేలో పాల్గొనాలని శిక్షణ సర్వేయర్లకు సూచించారు. శిక్షణ సర్వేయర్లకు స్వంత మండలం కాకుండా అందుబాటులోని మండలాలకు నియమించాలని కలెక్టర్ తెలిపారు.శిక్షణ సర్వేయర్లకు ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు చేపట్టేలా అదేవిధంగా పారితోషకాన్ని సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏడి సర్వేకు జిల్లా కలెక్టర్ సూచించారు.ముందుగా శిక్షణ సర్వేయర్లకు జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) కె.వెంకటాచారి భూ రీసర్వేపై పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. శిక్షణ పొందిన సర్వేయర్లకు నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి నియామక పత్రాలను అదనపు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బసవరాజ్ గుట్టూర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి మధుసూదన్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ బుచ్చయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# మధ్యప్రదేశ్ తహసీల్దార్ల ప్రశంసలు అందుకున్న సీఎం ప్రజావాణి

**హైదరాబాద్, జూలై 17 :**

తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం ప్రజావాణి కార్యక్రమం వినూత్నంగా సాగుతోందని మధ్యప్రదేశ్ రాష్ట్ర తహసీల్దార్లు ప్రశంసించారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో నిర్వహించిన 239వ సీఎం ప్రజావాణిని వారు సందర్శించి, కార్యక్రమం నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ కార్యక్రమం విధానాన్ని వారికి వివరించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో సీఎం ప్రజావాణి కీలక వేదికగా పనిచేస్తోందని మధ్యప్రదేశ్ అధికా రులు అభినందించారు. అదే రోజు నిర్వహించిన సీఎం ప్రజావాణిలో మొత్తం 260 దరఖాస్తులు స్వీకరిం చినట్లు అధికారులు తెలిపారు.




# ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, జూలై 17 :**



జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ప్రజలకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 4వ వార్డులో మందమర్రి మండల తహశీల్దార్ పి సతీష్ కుమార్, డిసిసి ప్రతినిధి పిన్నింటి రఘునాథ్ రెడ్డి లతో కలిసి, మందమర్రి మున్సిపాలిటీలోని 19వ వార్డులో మండల తహశీల్దార్ తో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజ్ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం ఆగస్టు 3 వరకు పొడిగించిందని, జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసే విధంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని అధికారులకు సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఓటర్లకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల సేకరణలో బూత్ స్థాయి ఏజెంట్లు అధికారులకు సహకరించాలన్నారు. నింపిన ఫారాలలోని వివరాలను బూత్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు బిఎల్ఓ యాప్ లో స్పష్టంగా నమోదు చేయాలని, అర్హత గల ఓటర్లు స్వయంగా ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చేపట్టాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి, కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని సూచించారు. వర్షాకాలం అయినందున అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించాలని, భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను ఇంటర్మీడియట్ కు ఆధునికరించడం జరిగిందని, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి, నాణ్యమైన విద్య అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆసియా అండర్-23 అథ్లెటిక్స్‌లో స్వర్ణం సాధించిన గురుకుల విద్యార్థిని ప్రవళికకు మంత్రి అడ్లూరి సత్కారం

**హైదరాబాద్, జూలై 17**

చైనాలో జరిగిన తొలి ఆసియా అండర్–23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2026లో మహిళల 4×400 మీటర్ల రిలేలో స్వర్ణ పతకం సాధించిన భారత జట్టులో సభ్యురాలైన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థిని నారిమల్ల ప్రవళికను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సత్కరించి అభినందించారు. సాధారణ కుటుంబం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి దేశానికి స్వర్ణ పతకం అందించడం తెలంగాణకు గర్వకారణమని మంత్రి అన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో క్రీడలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, ఆధునిక వసతులు, నాణ్యమైన శిక్షణతో ప్రపంచ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడలకు ప్రోత్సాహం పెరిగిందని, ఒలింపిక్స్‌లో పతకం సాధించిన వారికి గ్రూప్–1 స్థాయి ఉద్యోగం కల్పించే నిర్ణయం యువతకు మరింత ఉత్సాహాన్నిస్తోందన్నారు. ప్రవళిక కోచ్ పస్పుల పరుశురాముడు, శిక్షక బృందం, తల్లిదండ్రులను మంత్రి అభినందించారు.

చురకలు



# సైన్స్ ల్యాబ్ నిర్మాణం పూర్తి చేయకపోతే ఆందోళన

బాణాల రాజన్న

**మరిపెడ,జూలై18 :**

మరిపెడ మండలంలోని చిల్లంచర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాణాల రాజన్న డిమాండ్ చేశారు.శనివారం పాఠశాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించిన ఆయన ఉపాధ్యాయులు,విద్యార్థులతో మాట్లాడి పలు సమస్యలను తెలుసుకున్నారు.పాఠశాలలో సైన్స్ ల్యాబ్ గదుల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయిందని,కొత్త విద్యా సంవత్సరం



ప్రారంభమైన నేపథ్యంలో వెంటనే నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు.అలాగే పాఠశాలకు అవసరమైన డెస్కులు ఇప్పటికీ అందలేదని,వంటగది కూడా అత్యంత ఇబ్బందికర పరిస్థితుల్లో ఉందని పేర్కొన్నారు.పాఠశాల స్థలానికి స్పష్టమైన హద్దులు లేకపోవడంతో వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు.విద్యార్థులకు బాత్రూములు చాలా దూరంలో ఉండటంతో పాటు అక్కడికి వెళ్లే మార్గం కూడా సక్రమంగా లేదని,ముఖ్యంగా బాలురకు తగిన మరుగుదొడ్ల సౌకర్యం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అవసరమైన మౌలిక వసతులను తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు.సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణాన్ని కాంట్రాక్టర్ వెంటనే పూర్తి చేయాలని,లేని పక్షంలో విద్యార్థులను సమీకరించి కాంట్రాక్టర్ ఇంటి ముందు దశలవారీగా ఆందోళన చేపడ తామని బాణాల రాజన్న హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు తూము విజయ్ కుమార్,చనబోయిన వెంకన్న,ఉండ్రాతి సురేష్,ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# వర్షాభావానికి ప్రత్యామ్నాయ పంటలే పరిష్కారం

- **ఎల్ నీనో ప్రభావం పై రైతులకు అవగాహన కల్పించిన వ్యవసాయ శాఖ అధికారులు**

**ఆలేరు, జులై 18 :**

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. ఆలేరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఎల్‌నినో వాతావరణ ప్రభావం, ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, నీటి సంరక్షణతో సాగు చేయదగిన ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు వివరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలేరు మండలంలో ఈ కాలానికి సాధారణంగా 176.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 72.3 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదై దాదాపు 59 శాతం లోటు ఏర్పడిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటి వనరులను అత్యంత సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా రైతులు నష్టాలను తగ్గించుకోవచ్చని సూచించారు. ఒక ఎకరం వరి సాగుకు వినియోగించే నీటితో మూడు నుంచి నాలుగు ఎకరాల వరకు ఆరుతడి పంటలను సాగు చేయవచ్చని తెలిపారు. వరికి బదులుగా కందులు, పెసర్లు, మినుములు, జొన్నలు, ఆముదం వంటి పంటలతో పాటు కూరగాయల సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. నీటి వనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు కూడా లాభదాయకమని పేర్కొన్నారు. ఒక ఎకరం వరి పంటకు అవసరమయ్యే నీటితో రెండు ఎకరాల వరకు



ఆయిల్ పామ్ సాగు చేయవచ్చని వివరించారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వర్షాభావ పరిస్థితుల్లో పంటల ఎంపిక, నీటి నిర్వహణ, తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే పంటల సాగుపై రైతులకు అధికారులు పలు సూచనలు చేశారు. ఈ అవగాహన కార్యక్రమం రైతుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై చైతన్యం కల్పించేందుకు ఉపయోగపడిందని పాల్గొన్న రైతులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ జనగాం ఉపేందర్ రెడ్డి, డైరెక్టర్లు, సీఈవో వెంకటరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి శివకుమార్, రైతులు, ప్యాక్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# మరిపెడ డివిజన్ కల.. నెరవేరేదెప్పుడు?

**మరిపెడ,జూలై18 :**

ఎన్నికల ప్రచార సమయంలో మరిపెడను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాకపోవడంతో స్థానికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఈ అంశంపై స్పష్టమైన నిర్ణయం వెలువడకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు.మరిపెడ మండలం జిల్లా కేంద్రానికి దూరంగా ఉండటంతో పాటు,పరిసర మండలాల ప్రజలకుపరిపాలనాసేవలుఅందించేందుకు అనుకూల ప్రాంతంగా ఉన్నందున డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఎన్నో




ఏళ్లుగా డిమాండ్ కొనసాగుతోంది. ఎన్నికలసమయంలోప్రస్తుతముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరిపెడ ను డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని స్థానికులు గుర్తు చేస్తున్నారు.

డివిజన్ కేంద్రం ఏర్పాటుతో రెవెన్యూ, పరిపాలనా సేవలు ప్రజలకు మరింత చేరువవడం తో పాటు ప్రాంత అభివృద్ధికి ఊతం లభిస్తుందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకుని మరిపెడను డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని ప్రజలు కోరుతున్నారు.అలాగే,ఈ అంశంపై ప్రభుత్వ విప్,స్థానిక డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి మరిపెడ కు డివిజన్ కేంద్రం హోదా సాధించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రస్తుతం ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన కోసం మరిపెడ ప్రాంత ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 800 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉంది

డాక్టర్.పట్నం మహేందర్ రెడ్డి

**తాండూరు మున్సిపల్, జులై,18**

**మహేందర్ రెడ్డి కామెంట్స్ :-**

శనివారం వికారాబాద్ జిల్లాలో ని తాండూర్, పరిగి,వికారాబాద్ నియోజకవర్గాల్లో సుమారు 800 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉంది.మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్ బాబుల సహకారంతో తాండూర్ లో 270 కోట్ల నిధులతో రోడ్లు అభివృద్ధి చేయడం జరుగుతుంది.రాష్ట్రంలో ప్రభుత్వం అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతుంది.అతీ గతి లేని తాండూర్ నియోజకవర్గంలో తాను ఎంఎల్ఏ గా,



మంత్రిగా ఉన్నప్పుడు వందలాది కోట్లతో అభివృద్ధి చేశాను.ఎంతో ప్రాధాన్యం ఉన్న కోట్పల్లి రోడ్డు అభివృద్ధి తరహాలోని ఇంకా చాలా రోడ్లు అభివృద్ధి చేయాల్సి ఉంది. అందుకు నా సహకారం ఉంటుంది.అలాగే బషీరాబాద్ మండలంలో నవాంద్గీ నుండి కర్ణాటకలోని హల్కొడ్డ,కురుగుంటాలను ఇందర్ చేడ్ మీదుగా కలిపే పీఆర్ రోడ్లను ఆర్ అండ్ బి రోడ్డుగా మార్చి విస్తరణ పనులను చేపట్టి డబల్ రోడ్డు గా తీర్చిదిద్దాలని ఇలాంటి రోడ్లు తాండూర్ నియోజకవర్గంలో పెద్దేముల్,తాండూర్ మండలాల్లో ఉన్నాయని వాటి అన్నింటిని ఆర్ అండ్ బి రోడ్లుగా బదలాయించి సరిహద్దు వరకు డబల్ రోడ్లు వేయాలని మహేందర్ రెడ్డి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి సూచించారు.

# మూతపడిన పాఠశాలలో ఆర్ఎంపీ ఫస్ట్ ఎయిడ్ సెంటర్?

- **ప్రభుత్వ భవనాన్ని అక్రమంగా వినియోగిస్తున్నారనే ఆరోపణలు**
- **విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్**

**మరిపెడ,జూలై18:**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం రాంపురం గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామంలో మూతపడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఫస్ట్ ఎయిడ్ సెంటర్ గా వినియోగిస్తున్నారనే ఆరోపణలుస్థానికంగాచర్చనీయాంశంగా మారాయి.స్థానికుల కథనం ప్రకారం, సూర్యపేట జిల్లా నూతనకల్ మండలం పోలుమల్ల గ్రామానికి చెందిన ఓ ఆర్ఎంపీ వైద్యుడు గత రెండేళ్లుగా ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే మూతపడిన ప్రభుత్వ పాఠశాల భవనంలో ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వహిస్తున్నట్లుఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భవనాన్ని వ్యక్తిగత అవసరాలకు వినియోగించడం నిబంధనలకు విరుద్ధమని వారు పేర్కొంటున్నారు.ప్రభుత్వ ఆస్తిని ఈ విధంగా వినియోగిస్తున్నప్పటికీ సంబంధిత విద్యాశాఖ,గ్రామ పంచాయతీ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి,వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భవనాన్ని వినియోగిస్తున్నట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



# భారీగా గంజాయి స్వాధీనం

## జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా అదేశాలమేరకు



**వికారాబాద్, జులై,18**

వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ఆదేశాల మేరకు వికారాబాద్ డీఎస్పీ అంజయ్య ఆద్వర్యం లో విశ్వసనీయ సమాచారం ఆధారంగా సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం వికారాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో నిఘా ఏర్పాటు చేసి అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా,వారి వద్ద భారీ మొత్తంలో గంజాయి ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. పోలీసులు అరెస్టు చేసిన నిందితులు రామ్ హరి (43), తండ్రి కంగలి, పాశి గ్రామం, గంజాం జిల్లా, ఒడిశా రాష్ట్రం మరియు కలాబాబు ఖాన్ (33), తండ్రి తాల్బు ఖాన్, కొలకిరి గోపాలపూర్, జత్‌పూర్, ఒడిశా రాష్ట్రం గా గుర్తించారు. కలాబాబు ఖాన్ హోటల్‌లో వంటమనిషిగా పనిచేస్తుండగా,రామ్ హరి కూడా ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది.పోలీసుల విచారణలో నిందితులు తెలిపిన వివరాల ప్రకారం, ఒడిశా రాష్ట్రంలోని బెర్హంపూర్ రైల్వే స్టేషన్‌లో పరిచయమైన వీరిద్దరూ ఆర్థిక పరిస్థితులు మెరుగుపర్చుకోవాలనే ఉద్దేశంతో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడాలని నిర్ణయించుకున్నారు. గంజాం జిల్లాకు చెందిన సునీల్ పాండీ అనే వ్యక్తి ఒడిశా నుంచి హైదరాబాద్, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలకు గంజాయిని అక్రమంగా సరఫరా చేస్తూ పెద్ద ఎత్తున మాదకద్రవ్యాల వ్యాపారం నిర్వహిస్తున్నాడని తెలుసుకుని అతనితో సంబంధాలు ఏర్పరుచుకున్నారు. అతని నుంచి గంజాయి తీసుకుని, విక్రయాల ద్వారా వచ్చే లాభాల్లో 40 శాతం తమకు వాటాగా తీసుకుంటూ, అతను సూచించిన ప్రాంతాల్లో నిర్ణయించిన వ్యక్తులకు గంజాయిని అందజేసే బాధ్యతను నిర్వర్తిస్తున్నట్లు వారు అంగీకరించారు.సునీల్ పాండీ ఆదేశాల మేరకు నిందితులు ఒడిశాలోని బెర్హంపూర్ రైల్వే స్టేషన్ నుంచి రైలులో సికింద్రాబాద్‌కు చేరుకుని, అక్కడి నుంచి మరో రైలులో వికారాబాద్‌కు వచ్చారు. వికారాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని ప్లాట్‌ఫారం పక్కన ఉన్న నిర్మానుష్య ప్రాంతంలో వేచి ఉండగా, ముందస్తు సమాచారంతో నిఘా పెట్టిన పోలీసు బృందం వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ నిర్వహించింది.తనిఖీలలో కలాబాబు ఖాన్ వద్ద 9 కిలోల గంజాయి, రామ్ హరి వద్ద 21 కిలోల గంజాయి లభ్యమవగా, మొత్తం 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.అనంతరం నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయిని సీజ్ చేసి, NDPS చట్టాల ప్రకారం వికారాబాద్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ మాదకద్రవ్యాల సరఫరా వెనుక ఉన్న ప్రధాన నిందితుడు, ఇతర నెట్‌వర్క్ సభ్యులు, గంజాయిని స్వీకరించాల్సిన వ్యక్తుల వివరాలను సేకరించే దిశగా దర్యాప్తును పోలీసులు విస్తరించారు.ఈ సందర్భంగా వికారాబాద్ డీఎస్పీ అంజయ్య మాట్లాడుతూ, "మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగం సమాజానికి, ముఖ్యంగా యువత భవిష్యత్తుకు తీవ్ర ముప్పుగా మారుతున్నాయి. గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై వికారాబాద్ జిల్లా పోలీసులు ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు కొనసాగిస్తారు. రాష్ట్రాల మధ్య మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. గంజాయి విక్రయాలు, నిల్వలు లేదా రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలి. ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతాం. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి పౌరుడు పోలీసులకు సహకరించాలని" కోరారు.ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించి భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్న సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్, ప్రత్యేక పోలీసు బృందంలోని అధికారులు, సిబ్బందిని వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా,ఐపిఎస్ అభినందించడం జరిగింది అని వికారాబాద్ డీఎస్పీ అంజయ్య లో తెలియజేయడం జరిగింది.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం



**ఖమ్మం, జూలై 18 :**

పాలేరు నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నాణ్యతతో గడువులోపు పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి నిర్వహించిన సమీక్షలో టెండర్లు పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, పెండింగ్ బిల్లుల వివరాలు సమర్పించాలని మంత్రి ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, పాలేరు నియోజకవర్గంలో పూర్తిస్థాయి రీ-సర్వే చేపట్టి రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.

# వోకల్ ఫర్ లోకల్'కు చేయూత..

## చేతివృత్తుల మేళాను సందర్శించండి: మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూలై 18**

స్థానిక ఉత్పత్తులను ఆదరిస్తూ 'వోకల్ ఫర్ లోకల్' భావనను బలోపేతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ట్యాంక్‌బండ్ హెచ్‌ఎండీఏ మైదానంలో ఈ నెల 16 నుంచి 26 వరకు జరుగుతున్న ★'బోనాలు–చేతివృత్తుల మేళా'★లో చేనేత, హస్తకళలు, మట్టి, వెదురు వస్తువులు, తెలంగాణ వంటకాలు సహా 60 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున సందర్శించి హస్తకళ ఉత్పత్తులను కొనుగోలు చేసి కళాకారులను ప్రోత్సహించాలని మంత్రి కోరారు.





# చలికాలంలో ఈ ఆసనాలు..

## అనేక ఆరోగ్య ప్రయోజనాలు

చలికాలంలో శారీరక శ్రమ తగ్గడం, జీవక్రియలో మార్పులు, చలి వాతావరణం, తక్కువ పగటి వేళల కారణంగా సౌకర్యవంతమైన ఆహారం తీసుకోవడం వంటి వివిధ కారణాల వల్ల శీతాకాలంలో బరువు పెరగడం సాధారణం. చల్లగా ఉన్న సమయంలో మనం కదలకపోవడం వల్ల శరీరం సహజంగా శక్తిని ఆదా చేస్తుంది. అధిక కేలరీలు, వేడిగా ఉండే ఆహారాలను తినాలనే కోరిక పెరుగుతుంది. సూర్యరశ్మి మీ శరీరంలో సెరోటోనిన్ స్థాయిలను పెంచుతుంది. ఇది అతిగా తినడాన్ని ప్రేరేపించే మానసిక మార్పులకు దారితీస్తుంది. చలికాలంలో జీవక్రియను పెంచడం, మానసిక స్థితిని మెరుగుపరచడం, బరువు నిలుపుదలకి దోహదపడే కార్టిసాల్ వంటి ఒత్తిడి హార్మోన్లను తగ్గించుకోవడానికి యోగా ప్రభావవంతమైన మార్గంగా పనిచేస్తుంది. రెగ్యులర్ యోగాభ్యాసం శరీరాన్ని చురుకుగా ఉంచుతుంది. కేలరీలను బర్న్ చేయడంలో సహాయపడుతుంది. మంచి ఆహారపు అలవాట్లకు మద్దతు ఇస్తుంది. చలికాలంలో బరువు పెరగకుండా ఉండేందుకు చేసే యోగాసనాల గురించి తెలుసుకోండి.

### 1. సూర్య నమస్కారం

ఎలా చేయాలి:

ప్రణమాసనం (ప్రార్థన భంగిమ)లో నిటారుగా నిలబడండి.
ఊపిరి పీల్చుకోండి, హస్త ఉత్తనాసనలో చేతులను పైకి లేపండి.
ఊపిరి పీల్చుకోండి, పాదహస్తాసనానికి (చేతి నుండి పాదాల భంగిమ) ముందుకు వంగండి.
అశ్వ సంచలనాసన (ఈక్వెస్ట్రియన్ పోజ్) లోకి తిరిగి అడుగు పెట్టండి.
ఫలకాసనంలోకి (ప్లాంక్ పోజ్) లోకి వెళ్లండి.
అష్టాంగ నమస్కారం(మోకాళ్ళు, ఛాతీ, గడ్డం భంగిమ) లోకి క్రిందికి.
భుజంగాసనం (కోబ్రా పోజ్)లో ఊపిరి పీల్చుకోండి.
అధో ముఖః స్వనాసన (క్రిందికి కుక్క భంగిమ) లోకి ఊపిరి పీల్చుకోండి.
అశ్వ సంచలనాసనానికి తిరిగి వెళ్ళు.
పాదహస్తాసనంలోకి అడుగు ముందుకు వేయండి, ఆపై మీ చేతులను పైకెత్తి ప్రణామాసనానికి తిరిగి రండి.

### 2. నవాసనం

ఎలా చేయాలి:

కాళ్లు చాచి కూర్చోండి.
కొద్దిగా వెనుకకు వంగి, మీ కాళ్ళను 45డిగ్రీల కోణానికి ఎత్తండి.
నేలకి సమాంతరంగా చేతులను ముందుకు చాచండి.
1530 సెకన్లపాటు అలా ఉంచండి.

### 3. వీరభద్రాసనం

ఎలా చేయాలి:

పాదాలను వెడల్పుగా ఉంచి నిలబడండి.
కుడి పాదాన్ని బయటికి, ఎడమ పాదాన్ని కొద్దిగా లోపలికి తిప్పండి.
కుడి మోకాలిని 90 డిగ్రీల వద్ద వంచి, చేతులు సమాంతరంగా చాచండి.
2030 సెకన్లపాటు అలా ఉండండి

### 4. ఉత్కటాసనం

ఎలా చేయాలి:

పాదాలపై నిటారుగా నిలబడండి.
మోకాళ్లను వంచి, కుర్చీపై కూర్చున్నట్లుగా తుంటిని తగ్గించండి.
చేతులు పైకి ఎత్తండి.
2030 సెకన్లపాటు అలా ఉండండి.

### 5. భుజంగాసనం

ఎలా చేయాలి:

ముందుగా ఆసనం వేసేందుకు బోర్లా పడుకోవాలి.
అరచేతులను భుజాల క్రింద నేలపై పెట్టాలి.
చేతులను కిందికి నెడుతూ తలను మెల్లగా పైకి లేపాలి.
నడుము భాగాన్ని పైకి వంచాలి.
ఇలా 20 సెకన్లపాటు ఉండండి.

### 6. త్రికోణాసనం

ఎలా చేయాలి:

ముందుగా కాళ్లను దూరంగా ఉంచి నిలబడండి. నిదానంగా రెండు చేతులను కూడా భూమికి సమాంతరంగా పైకి లేపి ఉంచాలి. మోచేతులను వంచ కూడదు. అరచేతులను నేలవైపు ఉండే విధంగా చూడాలి. తర్వాత నిదానంగా గాలిని వదులుతూ కుడి చేతితో కుడి పాదాన్ని తాకే విధంగా మెల్లగా శరీరాన్ని వంచాలి.ఇదే సమయంలో ఎడమ అరచెయ్యిని పైకెత్తి నిటారుగా ఉంచాలి. శిరస్సు ఎడమ అరచేతి వైపు చూస్తూ ఉండాలి. తర్వాత శ్వాస పీలుస్తూ పైకి రావాలి. కుడి చేతివైపు ఏ విధంగా శరీరాన్ని వంచామో అదే విధంగా ఎడమ చేతి వైపు కూడా శరీరాన్ని వంచాలి. ఇలా 2030 సెకన్లపాటు ఉండాలి.

### 7. సేతు బంధాసనం

ఎలా చేయాలి:

ముందుగా వెల్లకిలా పడుకోవాలి.
తర్వాత మెల్లగా మోకాళ్లను వంచాలి.
మోకాళ్లను వంచి శ్వాస గట్టిగా తీసుకొని.. రెండు చేతులతో పాదాలను పట్టుకొని నడుమును పైకి ఎత్తాలి.
మీకు వీలైనంత మేర నడుమును ఎత్తాలి.గడ్డానికి ఛాతి తగిలేంతలా నడుమును ఎత్తాలి. నడుము పైకి ఎత్తి ఉండగా.. శరీర భారం పాదాలు, మెడ, తల, భుజాలపై ఉంటుంది. ఈ సేతుబంధాసనంలో వీలైనంత సమయం ఉండాలి. ఆ తర్వాత మళ్లీ సాధారణంగా వెల్లకిలా పడుకున్న పొజిషన్‌కు రావాలి. ఇలా 30 సెకన్ల పాటు చేయాలి.
30 సెకన్లపాటు పట్టుకోండి.

### 8. పశ్చిమోత్తనాసనం

ఎలా చేయాలి:

నేలపై రెండు కాళ్లు చాచి కూర్చోండి.
తర్వాత శరీరాన్ని ముందుకు వంచుతూ పొట్టను తొడలపై పెట్టాలి. అలాగే తలను మోకాళ్లపై ఆనించాలి. ఇప్పుడు రెండు చేతులను ముందుకు చాచి రెండు పాదాలను పట్టుకోవాలి. ఇలా 30 సెకన్లపాటు పట్టుకోండి.

### 9. కపోతాసనం

ఎలా చేయాలి:

మొదలు వజ్రాసనంలో కూర్చోవాలి. గాలి పీల్చుకుంటూ తలపైకి ఎత్తాలి. ఇలా చేస్తున్నప్పుడు ధ్యాస వెన్నెముక మీద కేంద్రీకరించాలి. ఇప్పుడు గాలి వదిలేస్తూ చేతులో బ్యాలెన్స్ చూసుకుంటూ మెల్లగా వెనక్కు వంగుతూ ఉండాలి. తలను భూమీ మీద ఆనించాలి. తర్వాత వెనక్కు వంగాక చేతులతో కాళ్లను పట్టుకోవాలి. కాళ్ల దగ్గరకు తలను తీసుకురావాలి. 20 30 సెకన్లపాటు అలా ఉండాలి.

### 10. శలభాసనం

ఎలా చేయాలి:

గడ్డం నేలపై ఆనించి, కొద్దిగా శ్వాస పీల్చి మొదట కుడికాలును మోకాలు వంచకుండా పైకి ఎత్తాలి. ఈ స్థితిలో కొన్ని క్షణాలున్న తర్వాత మెల్లగా కాలు నేలపై ఆనించాలి. ఇదే విధంగా ఎడమకాలితో చేయాలి. మూడేసి సార్లు ఒక్కొక్క కాలితో చేసిన తర్వాత, రెండు కాళ్ళను కలిపి ఒకేసారి పైకి ఎత్తి కొద్ది క్షణాలు ఆగాలి. 2030 సెకన్లపాటు ఇలా చేయాలి. ఈ భంగిమలను క్రమం తప్పకుండా ఆచరించడం వల్ల జీవక్రియ పెరుగుతుంది.





# మజ్జిగలో దీన్ని కలుపుకొని తాగండి..!

మజ్జిగ అంటే అందరికీ ఇష్టం ఉంటుంది. ఇది కేవలం పానీయం మాత్రమే కాదు. ఆరోగ్యానికి మేలు చేసే ఔషధం కూడా. ఇందులో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయి. దీనిని తాగడం వల్ల అనేక రోగాలు దూరమవుతాయి. ఇందులో జీలకర్ర కలుపుకొని తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. జీర్ణక్రియ మెరుగుపడ డం, శరీరాన్ని చల్లబరచడం అనే ఆరోగ్య ప్రయో జనాలు దొరుకుతాయి. అసలు మజ్జిగలో జీలకర్ర కలుపుకొని తాగడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు లభిస్తాయి? అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

**జీర్ణ సమస్యలు దూరం**

మజ్జిగలో జీలకర్ర కలుపుకొని తాగడం వల్ల జీర్ణక్రియ సమస్యలన్నీ దూరమవుతాయి. అజీర్తి, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలు దూరమవుతాయి. అలాగే శరీరంలోని అదనపు ద్రవాలను తొలగించ డానికి ఈ జీలకర్ర మజ్జిగ ఎంతగానో ఉపయోగ పడుతుంది. వాపును నివారిస్తుంది. చర్మం కాంతి వంతంగా మెరిసే విధంగా చేస్తుంది. ముఖ్యంగా మొటిమలు, మచ్చలు వంటి సమస్యలు దూరమ వుతాయి. అలాగే జీలకర్రలోని యాంటీ యాక్సి డెంట్లు రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. అలాగే కండరాల నొప్పులను తగ్గించేందుకు కూడా ఇవి ఎంతగానో సహాయపడుతుంది.

**జీలకర్ర మజ్జిగ తయారు చేయడం ఎలా?**

జీలకర్ర మజ్జిగ తయారు చేసుకోవడానికి, ఒక కప్పు పెరుగు తీసుకోవాలి. అందులో కొద్దిగా జీలక ర్ర పొడి, ఉప్పు, నీరు కలుపుకోవాలి. మీకు ఇష్టమైతే కొద్దిగా కారం కూడా కలుపుకోవచ్చు. ఆ మొత్తాన్ని బాగా కలుపుకోవాలి. ఆ తరువాత ఆ మజ్జిగను సర్వ్ చేసుకుంటే జీలకర్ర మజ్జిగ సిద్ధమైనట్లే.

**శృంగారానికి కూడా**

మజ్జిగతో పాటు జీలకర్రలో కూడా శృంగానికి పనికొచ్చే పోషకాలు పుష్కలంగా ఉంటాయి. జీలకర్ర మజ్జిగను తక్కువగా తీసుకోవడం వల్ల శృంగారంలో కింగ్ అవ్వొచ్చు. మీ భాగస్వా మిని సంతృప్తి పరచొచ్చు. వెంటనే స్కలనం కాకుండా రతి క్రీడను ఎంజాయ్ చేయవచ్చు. మజ్జిగ జీలకర్రను తీసుకోవడం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవు. అయితే కొన్ని కొన్ని సం దర్భాల్లో మాత్రం కొంత సమస్య తలెత్తే అవకాశం ఉంటుంది. అవేంటంటే? మజ్జిగలో లాక్టోస్ అనే పదార్థం ఎక్కువ మొత్తం ఉంటుంది. అయితే ఈ మజ్జిగ అంటే అసహనం ఉన్న వారికి ఈ జీలకర్ర మజ్జిగ తాగడం వల్ల వాంతులు వచ్చే అవకాశం ఉంటుంది. దీంతో పాటు అపానవాయువు, ఉబ్బరం, అతిసారం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే దీనిని అధికంగా తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. చలికాలంలో మజ్జి గను ఎక్కువగా తీసుకోవడం శరీరం చల్లగా మారే అవకాశం ఉంటుంది. మజ్జిగ జీలకర్రను మితంగా తీసుకోవడం మంచిది. తాజాగా తయారు చేసిన మజ్జిగ జీలకర్రను తీసుకోవడం మంచిది. ఏదైనా ఆరోగ్య సమస్య ఉన్నట్లయితే వైద్యుని సలహా తీసు కోవడం మంచిది.

# మిగిలిన అన్నంతో దోశలు చేసుకోండి..!

ప్రతి ఇంట్లోనే అన్నం మిగిలిపోవడం కామన్. అయితే ఈ అన్నం పడేయాలంటే చాలా మందికి మనస్కరించదు. అందుకే మిగిలిన అన్నంతో అనేక రకాల వంటలు చేసుకోవచ్చు. ఉదయం మిగిలి పోయిన అన్నాన్ని రాత్రి తినేందుకు ఎంతో మంది ఇష్టపడరు. నిజానికి రాత్రి వండిన అన్నం ఉదయం తింటే ఎంతో ఆరోగ్యం. అలాగే ఉదయం వండిన అన్నం రాత్రి తిన్నా కూడా ఆరోగ్యమే. వేసవికాలం లో అన్నం బయట ఉంచితే త్వరగా పాడైపోయే అవకాశం ఉంటుంది. కానీ చలికాలంలో అది త్వరగా పాడవదు. కాబట్టి ఆ అన్నం తినడం సురక్షి తమే. మీకు మిగిలిపోయిన అన్నాన్ని తినడం ఇష్టం లేకపోతే వాటిని దోశలుగా మార్చేయండి. ఇవి చాలా టేస్టీగా ఉంటాయి. పైగా ఇన్స్టెంట్ దోశలు. కొబ్బరి చట్నీతో లేదా టమాటో చట్నీతో ఈ దోశలను తింటే చాలా రుచిగా ఉంటాయి. ఒక్కసారి మీరు చేసుకొని చూడండి. ఈ రెసిపీ మీ ఇంటిల్లిపాదికి నచ్చడం ఖాయం.

**కావలసిన పదార్థాలు**

మిగిలిపోయిన అన్నం - రెండు కప్పులు
నీరు - సరిపడినంత
వంటసోడా - అర స్పూను
ఉప్పు - రుచికి సరిపడా
పుల్లని పెరుగు - ఒక కప్పు
గోధుమపిండి - ఒక కప్పు
ఉప్మా రవ్వ - ఒక కప్పు

**తయారీ విధానం...**

ముందుగా అన్నాన్ని పొడిపొడిగా ఉండేలా చూసుకోండి. మిక్సీలో ఈ అన్నాన్ని గోధుమ పిండిని వేసి బాగా కలపండి. అందులోనే నీళ్లను కూడా వేయండి. అలాగే పుల్లని పెరుగును కూడా వేసి బాగా కలపండి. ఈ మొత్తం మిశ్రమాన్ని పంపండి. దీన్ని ఒక గిన్నెలో వేయండి.

ఆ గిన్నెలోనే ఉప్మా రవ్వను కూడా వేసి బాగా కలు పుకోండి. రుచికి సరిపడా ఉప్పుని, వంట సోడాను కూడా వేయండి. దోశెలు వేయడానికి ఈ మిశ్రమం పలుచగా ఉండేలా చూసుకోండి. అవసరమైతే నీటిని కలపండి. ఈ మొత్తం మిశ్రమాన్ని ఒక పది నిమిషాలు పాటు పక్కన వదిలేయండి. ఇప్పుడు స్టవ్ మీద పెనం పెట్టి నూనె రాయండి. ఆ నూనె పై ఈ దోశల పిండిని పలుచగా వచ్చేలా వేసుకోండి. రెండు వైపులా కాల్చాక తీసి పక్కన పెట్టుకోండి. అంతే టేస్టీ దోశెలు రెడీ అయినట్టే. దీన్ని కొబ్బరి చట్నీతో తిన్నా అల్లం చట్నీతో తిన్నా టమోటా చట్నీ తో తిన్నా రుచిగా ఉంటాయి. అన్నం మిగిలిపోయినప్పుడు పడేయా ల్సిన అవసరం లేకుండా ఇలా దోశలు వండుకుంటే రుచి అదిరిపోతుంది.



# ఫిఫా ప్రపంచకప్ ఘన విజయంపై ట్రంప్, ఇన్ఫాంటినో ప్రశంసలు



**న్యూయార్క్, జూలై 18 :** ఫిఫా ప్రపంచకప్--2026 టోర్నమెంట్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఫిఫా అధ్యక్షుడు గియాని ఇన్ఫాంటినో ప్రశంసలతో ముంచెత్తారు. న్యూయార్క్‌లోని ట్రంప్ టవర్‌లో నిర్వహించిన అధికారిక ఫిఫా కార్యక్రమంలో పాల్గొన్న ఇద్దరూ ఈ మెగా టోర్నీ ప్రపంచ క్రీడా చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించిందని పేర్కొన్నారు. ట్రంప్ మాట్లాడుతూ, ప్రపంచకప్ అభిమానులకు ఎన్నో మరపురాని క్షణాలను అందించిందన్నారు. టోర్నీలో అమెరికా ఆటగాడు ఫోలారిన్ బలోగన్‌పై విధించిన రెడ్‌కార్డు నిషేధాన్ని ఫిఫా నిబంధనల ప్రకారం రద్దు చేయడంతో అతడు బెల్జియంతో జరిగిన రౌండ్ ఆఫ్--16 మ్యాచ్‌లో ఆడే అవకాశం లభించిందని గుర్తు చేశారు. అయితే ఆ మ్యాచ్‌లో అమెరికా పరాజయం పాలైన విషయాన్ని కూడా ప్రస్తావించారు. భవిష్యత్తులో ప్రపంచకప్‌ను మెక్సికో, కెనడా భాగస్వామ్యం లేకుండా అమెరికా ఒక్కటే నిర్వహించినా, లేదా చైనాతో కలిసి సంయుక్తంగా ఆతిథ్యం ఇచ్చినా ఆసక్తికరంగా ఉంటుందని ట్రంప్ సరదాగా వ్యాఖ్యానించారు. ఫిఫా అధ్యక్షుడు గియాని ఇన్ఫాంటినో మాట్లాడుతూ, ప్రపంచకప్ కేవలం ఫుట్‌బాల్ టోర్నీ మాత్రమే కాదని, ప్రపంచాన్ని ఒక్కతాటిపైకి తీసుకొచ్చే గొప్ప సామాజిక, సాంస్కృతిక వేడుకగా నిలిచిందన్నారు. సుమారు 70 లక్షల మంది ప్రత్యక్షంగా స్టేడియాల్లో మ్యాచ్‌లు వీక్షించగా, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది టెలివిజన్, డిజిటల్ వేదికల ద్వారా ఈ టోర్నీని ఆస్వాదించారని తెలిపారు. ఇదిలా ఉండగా, ప్రపంచకప్ ఫైనల్‌కు డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా, యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్ జట్లు అర్హత సాధించాయి. సెమీఫైనల్లో స్పెయిన్ 2-0 తేడాతో ఫ్రాన్స్‌ను ఓడించగా, అర్జెంటీనా 2-1తో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది. ఫైనల్లో అర్జెంటీనా దిగ్గజం లియోనెల్ మెస్సీ, స్పెయిన్ యువ సంచలనం లామిన్ యమాల్ మధ్య పోరు అభిమానుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. గోల్డెన్ బూట్ రేసులో ప్రస్తుతం మెస్సీ అగ్రస్థానంలో కొనసాగుతుండటంతో ఈ ఫైనల్‌పై ప్రపంచవ్యాప్తంగా

# మెస్సీపై షకీరా ప్రశంసల జల్లు



న్యూయార్క్, జూలై 18 : ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫిఫా ప్రపంచకప్--2026 ఫైనల్‌కు ముందు అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సీపై అంతర్జాతీయ పాప్ గాయని షకీరా ప్రశంసల వర్షం కురిపించారు. స్పెయిన్‌తో ఆదివారం జరిగే టైటిల్ పోరుకు ముందు మెస్సీకి ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. మెస్సీ అసాధారణ ప్రతిభ కలిగిన ఆటగాడని, అతని క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయని షకీరా పేర్కొన్నారు. వయసు లేదా విమర్శలు ఏ వ్యక్తి సామర్థ్యాన్ని నిర్ణయించలేవని, తన ఆటతో మెస్సీ మరోసారి నిరూపిస్తున్నాడని ఆమె వ్యాఖ్యానించారు. మెస్సీ విజయాల వెనుక అతని భార్య ఆంటోనెలా కీలక పాత్ర పోషిస్తున్నారని కూడా షకీరా తన పోస్టులో ప్రస్తావించారు. కుటుంబ సభ్యుల అండ, ముఖ్యంగా జీవిత భాగస్వామి ప్రోత్సాహం వల్లే మెస్సీ మైదానంలో మరింత ఆత్మవిశ్వాసంతో రాణిస్తున్నాడని ఆమె అభిప్రాయపడ్డారు. షకీరా చేసిన ఈ పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఆమె వ్యాఖ్యలను ప్రశంసిస్తూ విస్తృతంగా పంచుకుంటున్నారు.

ఈ పోస్టుపై మెస్సీ భార్య ఆంటోనెలా కూడా స్పందించారు. షకీరాకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆమె తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఆ పోస్టును రీషేర్ చేశారు. దీంతో ఇద్దరు ప్రపంచ ప్రఖ్యాత సెలబ్రిటీల పోస్టులు సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చకు దారితీశాయి. మెస్సీ, ఆంటోనెలా చిన్ననాటి స్నేహితులు. చాలా సంవత్సరాల ప్రేమ అనంతరం 2017లో వివాహం చేసుకున్న ఈ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. ఫైనల్ మ్యాచ్‌కు ముందు షకీరా చేసిన ప్రశంసలు, ఆంటోనెలా స్పందనతో అర్జెంటీనా అభిమానుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. ప్రస్తుతం ప్రపంచ దృష్టి అంతా అర్జెంటీనా--స్పెయిన్ మధ్య జరగనున్న ప్రతిష్ఠాత్మక ఫైనల్‌పైనే నిలిచింది.




# ఫిఫా ఫైనల్ టికెట్‌కు రూ.27 లక్షలు!

**న్యూయార్క్, జూలై 18 :** ఫిఫా ప్రపంచకప్-2026 తుది దశకు చేరుకుంది. ఆదివారం న్యూయార్క్‌లోని మెట్‌లైఫ్ స్టేడియంలో అర్జెంటీనా, స్పెయిన్ జట్లు ప్రతిష్ఠాత్మక ఫైనల్‌లో తలపడనున్నాయి. ఈ హోరాహోరీ పోరును ప్రత్యక్షంగా వీక్షించేందుకు ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదే సమయంలో ఫైనల్ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్ ధర మరో సంచలనంగా మారింది. అత్యున్నత హాస్పిటాలిటీ టికెట్ ధర ఏకంగా రూ.27 లక్షలకు చేరుకుని ఫిఫా ప్రపంచకప్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన టికెట్‌గా నిలిచింది. ఓ అంతర్జాతీయ క్రీడా మీడియా నివేదిక ప్రకారం, అత్యున్నత శ్రేణి హాస్పిటాలిటీ ప్యాకేజీ ధర సుమారు రూ.27 లక్షలు. ఈ ప్యాకేజీలో మ్యాచ్‌ను వీక్షించే అవకాశం మాత్రమే కాకుండా విలాసవంతమైన లాంజ్‌లు, ప్రత్యేక అతిథి సేవలు, అత్యున్నత స్థాయి విందు, కార్పొరేట్ అతిథులకు ప్రత్యేక సౌకర్యాలు కూడా అందుబాటులో ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వీఐపీలు, వ్యాపారవేత్తలను దృష్టిలో ఉంచుకుని ఫిఫా ఈ ప్రత్యేక ప్యాకేజీలను రూపొందించింది. అయితే ఈ భారీ ధరలు కేవలం హాస్పిటాలిటీ ప్యాకేజీలకే పరిమితమని నిర్వాహకులు స్పష్టం చేశారు. సాధారణ అభిమానుల కోసం అందుబాటులో ఉన్న టికెట్ల ధరలు వీటితో పోలిస్తే చాలా తక్కువగా ఉన్నప్పటికీ, కనిష్ఠ టికెట్ ధర కూడా 6,943 డాలర్లు (సుమారు రూ.6 లక్షలు)గా ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటివరకు అమెరికాలో అత్యంత ఖరీదైన క్రీడా ఈవెంట్‌గా 2024 సూపర్‌బౌల్ నిలిచింది. ఆ మ్యాచ్‌కు సగటు టికెట్ ధర సుమారు రూ.9.6 లక్షలుగా నమోదైంది. అయితే ఇప్పుడు ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ హాస్పిటాలిటీ టికెట్ ధర ఆ రికార్డును దాదాపు మూడు రెట్లు అధిగమించి కొత్త చరిత్ర సృష్టించింది. ఈ భారీ ధరలపై క్రీడాభిమానుల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. అంతర్జాతీయ క్రీడా ఈవెంట్ల టికెట్లు సామాన్యులకు అందని స్థాయికి చేరుతున్నాయని, దీంతో నిజమైన అభిమానులు స్టేడియాలకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కార్పొరేట్ ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచ క్రీడా ఈవెంట్ల అందుబాటు అంశంపై మరోసారి చర్చ మొదలైంది.

# జపాన్ ఓపెన్ ఫైనల్లోకి దూసుకెళ్లిన పీవీ సింధు

**టోక్యో, జూలై 18 :** భారత స్టార్ షట్లర్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు సుదీర్ఘ విరామం తర్వాత మరోసారి అద్భుత ప్రదర్శనతో మెరిసింది. జపాన్ ఓపెన్ సూపర్ సిరీస్ మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో చైనా స్టార్, టోక్యో ఒలింపిక్స్ ఛాంపియన్ చెన్ యుఫీపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. గత రెండేళ్లలో సింధు ఒక ప్రధాన అంతర్జాతీయ టోర్నీలో ఫైనల్‌కు చేరడం ఇదే తొలిసారి. ప్రపంచ 12వ ర్యాంకర్ సింధు, నాలుగో ర్యాంకర్ చెన్ యుఫీ మధ్య జరిగిన సెమీఫైనల్ పోరు హోరాహోరీగా సాగింది. తొలి గేమ్‌లో ఇద్దరూ సమానంగా పోటీపడగా, సింధు 21-19తో ఆధిక్యం సాధించింది. రెండో గేమ్‌లో కూడా అదే జోరును కొనసాగించిన ఆమె 15-10తో ముందంజలో నిలిచింది. ఈ సమయంలో చెన్ యుఫీ హ్యామ్‌స్ట్రింగ్ గాయానికి గురైంది. వైద్యుల చికిత్స అనంతరం కూడా ఆట కొనసాగించలేక మ్యాచ్ మధ్యలోనే రిటైర్డ్ హర్ట్‌గా వైదొలిగింది. దీంతో సింధు విజేతగా నిలిచి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో సింధు తన పాత దూకుడును ప్రదర్శించింది. శక్తివంతమైన స్మాష్‌లు, కచ్చితమైన షాట్లతో ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచింది. తొలి గేమ్‌లో 18-18తో స్కోరు సమంగా ఉన్న సమయంలో జరిగిన 51 షాట్ల సుదీర్ఘ ర్యాలీని సింధు గెలుచుకోవడం మ్యాచ్‌కు హైలైట్‌గా నిలిచింది. మ్యాచ్ అనంతరం సింధు మాట్లాడుతూ, స్కోరు గురించి ఆలోచించకుండా ప్రతి పాయింట్‌పైనే దృష్టి పెట్టాలని తన కోచ్ సూచించారని తెలిపింది. ఆ సలహా తన ఆటతీరును మార్చిందని, ప్రశాంతంగా ఆడేందుకు ఎంతో ఉపయోగపడిందని పేర్కొంది. 2024లో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టోర్నీ టైటిల్ గెలిచిన తర్వాత సింధు మళ్లీ ఫైనల్‌కు చేరడం ఇదే మొదటిసారి. అలాగే గత నాలుగు మ్యాచ్‌ల్లో చెన్ యుఫీ చేతిలో ఎదురైన పరాజయాలకు కూడా ఈ విజయంతో తెరపడింది. ఆదివారం జరిగే ఫైనల్లో జపాన్‌కు చెందిన అకానె యమగూచి లేదా ఇండోనేషియాకు చెందిన పుత్రి కుసుమ వర్దానితో సింధు టైటిల్ కోసం తలపడనుంది. మరోసారి అంతర్జాతీయ టైటిల్‌ను సొంతం చేసుకోవాలని భారత అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు.







# రోహిత్ రిటైర్మెంట్‌పై బీసీసీఐ స్పష్టత

**లండన్, జూలై 18 :** భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నారనే ప్రచారంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) స్పష్టత ఇచ్చింది. ఇంగ్లండ్‌తో ఆదివారం లార్డ్స్‌లో జరిగే వన్డే మ్యాచ్ రోహిత్ శర్మ కెరీర్‌లో చివరి అంతర్జాతీయ మ్యాచ్ కాదని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. ఈ విషయంలో వస్తున్న వార్తలకు ఎలాంటి ఆధారం లేదని ఆయన పేర్కొన్నారు. రోహిత్ శర్మ భారత వన్డే జట్టులో కీలక సభ్యుడని, దేశానికి ఆయన మరికొంత కాలం సేవలు అందిస్తారని సైకియా వెల్లడించారు. లార్డ్స్ వన్డే తర్వాత రోహిత్ రిటైర్మెంట్‌పై ఎలాంటి చర్చలు జరగలేదని, మీడియాలో వస్తున్న కథనాలు కేవలం ఊహాగానాలేనని ఆయన స్పష్టం చేశారు. చాంపియన్స్ ట్రోఫీ విజయం తర్వాత రోహిత్ శర్మ 14 వన్డే ఇన్నింగ్స్‌ల్లో 589 పరుగులు సాధించాడు. ఈ కాలంలో ఆయన 45.3 సగటుతో, 92.03 స్ట్రైక్‌రేట్‌తో ఒక శతకం, నాలుగు అర్ధశతకాలు నమోదు చేశాడు. గణాంకాల పరంగా ఆయన ప్రదర్శన కెరీర్ సగటుకు దగ్గరగానే ఉన్నప్పటికీ, గతంలో కనిపించిన దూకుడు మాత్రం తగ్గిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2023 వన్డే ప్రపంచకప్‌లో 54.27 సగటు, 125.94 స్ట్రైక్‌రేట్‌తో ఆడిన రోహిత్ భారత్‌ను ఫైనల్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే ఇటీవలి మ్యాచ్‌ల్లో ఆ స్థాయి దూకుడు కనిపించడం లేదని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రతి ఇన్నింగ్స్‌లో ఒత్తిడిని ఎదుర్కొంటూ ఆడుతున్నట్లు ఆయన ఆటతీరు సూచిస్తోందని పేర్కొంటున్నారు. మరోవైపు భారత జట్టులో ఓపెనర్ స్థానానికి పోటీ మరింత పెరుగుతోంది. యువ ఆటగాళ్లు యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్ వరుసగా నిలకడైన ప్రదర్శన చేస్తుండటంతో జట్టులో స్థానం కోసం పోటీ తీవ్రంగా మారింది. జైస్వాల్ ఇటీవల మూడు వన్డేల్లో రెండు శతకాలు నమోదు చేయగా, రుతురాజ్ కూడా దక్షిణాఫ్రికాపై శతకం సాధించి తన సామర్థ్యాన్ని నిరూపించాడు. అయినప్పటికీ, రోహిత్ శర్మపై జట్టు యాజమాన్యానికి పూర్తి విశ్వాసం ఉందని బీసీసీఐ తాజా ప్రకటనతో మరోసారి స్పష్టమైంది.



## రష్మిక అంకితభావానికి బృందా మాస్టర్ ప్రశంసలు

హైదరాబాద్, జులై 18 : స్టార్ కథానాయిక రష్మిక మందన్న అంకితభావం, క్రమశిక్షణే ఆమె విజయానికి ప్రధాన కారణమని ప్రముఖ నృత్య దర్శకురాలు బృందా మాస్టర్ ప్రశంసించారు. ప్రస్తుతం దర్శకుడు రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్న 'మైసా' చిత్రంలోని ఓ పాటకు నృత్య దర్శకత్వం వహిస్తున్న ఆమె, రష్మిక పనితీరును కొనియాడుతూ సామాజిక మాధ్యమాల్లో భావోద్వేగపూరిత సందేశాన్ని పంచుకున్నారు.

రిహార్సల్స్ నుంచి చిత్రీకరణ వరకు రష్మిక చూపిన కష్టపడే తత్వం తనను ఎంతగానో ఆకట్టుకుందని బృందా మాస్టర్ తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా సినీ పరిశ్రమలో ఉన్నప్పటికీ ఇంత క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసే కథానాయికలు చాలా అరుదుగా కనిపిస్తారని పేర్కొన్నారు. తాను సూచించిన ప్రతి మార్పును చిరునవ్వుతో స్వీకరించి వెంటనే అమలు చేయడం రష్మిక ప్రత్యేకత అని ఆమె ప్రశంసించారు. శారీరకంగా నొప్పితో ఉన్న సందర్భాల్లో కూడా రష్మిక తన దృష్టిని పనిపై నుంచి మరల్చలేదని బృందా మాస్టర్ వెల్లడించారు. సినిమా కోసం ఆమె చేసిన శ్రమ తెరపై ప్రతి ప్రేక్షకుడికి స్పష్టంగా కనిపిస్తుందని, ఈ పాత్ర కోసం రష్మిక ఎంతో కష్టపడిందని పేర్కొన్నారు. ఆమె అంకితభావం యువ నటీనటులకు ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. 'మైసా' చిత్రంలో రష్మిక గోండ్ గిరిజన యువతి పాత్రలో కనిపించనున్నారు. భావోద్వేగాలతో పాటు శారీరకంగా కూడా సవాల్ విసిరే పాత్రగా దీనిని రూపొందిస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రంలో ఈశ్వరి రావు, గురు సోమసుందరం, రావు రమేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తుండగా, అంతర్జాతీయ యాక్షన్ నిపుణుడు ఆండీ లాంగ్ పోరాట సన్నివేశాలను రూపొందిస్తున్నారు.




## రూ.100 కోట్ల క్లబ్‌లోకి 'ధమాల్--4'

**ముంబై, జూలై 18 :** బాలీవుడ్ స్టార్ హీరో అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో నటించిన హాస్య వినోద చిత్రం 'ధమాల్-4' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, ప్రేక్షకుల ఆదరణతో ఈ చిత్రం వసూళ్ల పరంగా సత్తా చాటుతోంది. రెండో వారంలోనూ అదే జోరును కొనసాగిస్తూ దేశీయంగా రూ.100 కోట్ల నికర వసూళ్ల మైలురాయిని అధిగమించింది. రెండో శుక్రవారం కూడా ఈ చిత్రం ఆశాజనక వసూళ్లు నమోదు చేయడం సినీ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. సాధారణంగా రెండో వారానికి సినిమాల వసూళ్లు తగ్గుముఖం పట్టే పరిస్థితి కనిపిస్తుంటే, 'ధమాల్-4' మాత్రం స్థిరమైన ప్రదర్శనతో ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తోంది. వారాంతంలో వసూళ్లు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇటీవలి కాలంలో విడుదలైన పలువురు బాలీవుడ్ అగ్ర హీరోల చిత్రాలు ప్రారంభ రోజుల్లోనే జోరు చూపి, ఆ తర్వాత వేగంగా తగ్గిపోయాయి. అయితే 'ధమాల్-4' మాత్రం అలాంటి పరిస్థితిని ఎదుర్కోకుండా నిలకడగా ప్రదర్శితమవుతోంది. సమీప రోజుల్లో పెద్ద చిత్రాల విడుదల లేకపోవడం కూడా ఈ సినిమాకు కలిసి వస్తోందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ముఖ్యంగా తదుపరి భారీ చిత్రం విడుదలయ్యే వరకు ఈ సినిమాకు బాక్సాఫీస్ వద్ద అనుకూల పరిస్థితులు కొనసాగనున్నాయని భావిస్తున్నారు.



## గర్భంతోనే యాక్షన్ సన్నివేశాల్లో దీపిక

**ముంబై, జూలై 18 :** గర్భవతిగా ఉన్నప్పటికీ యాక్షన్ సన్నివేశాల్లో నటించి బాలీవుడ్ కథానాయిక దీపిక పదుకోన్ అరుదైన ఘనత సాధించినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. భారతీయ చలనచిత్ర చరిత్రలో గర్భధారణ సమయంలో షూటింగ్‌లలో పాల్గొన్న నటీమణులు చాలామందే ఉన్నప్పటికీ, గర్భంతోనే కఠినమైన యాక్షన్ సన్నివేశాల్లో నటించడం మాత్రం అత్యంత అరుదైన విషయంగా భావిస్తున్నారు. ప్రస్తుతం అల్లు అర్జున్ కథానాయకుడిగా, దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రాకా'లో దీపిక కథానాయికగా నటిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన కీలక యాక్షన్ ఘట్టాలను దర్శకుడు అట్లీ చిత్రీకరించినట్లు సమాచారం. రెండో సంతానానికి జన్మనివ్వబోతున్న దీపిక, గర్భంతోనే ఈ సన్నివేశాల్లో పాల్గొనడం సినీ పరిశ్రమలో ఆసక్తికరంగా మారింది. భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, ప్రత్యేక జాగ్రత్తల నడుమ ఈ చిత్రీకరణ నిర్వహించినట్లు తెలుస్తోంది. వృత్తిపట్ల ఆమె చూపిన అంకితభావాన్ని చిత్రబృందం ప్రశంసించినట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక ఈ సినిమా కోసం సాధారణంగా తాను పాటించే ఎనిమిది గంటల పని విధానాన్ని కూడా దీపిక పక్కన పెట్టినట్లు సమాచారం. మాతృత్వ విరామానికి వెళ్లే ముందు 'రాకా'లో తనకు సంబంధించిన చిత్రీకరణను పూర్తిచేయాలని ఆమె నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. షూటింగ్‌లో పాల్గొంటూనే తన తొలి కుమార్తె దువా సంరక్షణ బాధ్యతలను కూడా సమర్థంగా నిర్వర్తిస్తూ నటిగా, తల్లిగా రెండు పాత్రలను సమానంగా నిర్వహిస్తున్నారని చిత్రబృందం తెలిపినట్లు సమాచారం. కుటుంబ బాధ్యతలు, వృత్తిపరమైన కర్తవ్యాల మధ్య సమతుల్యత పాటిస్తున్న దీపిక తీరు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో ప్రశంసలు అందుకుంటోంది. జీవితంలోని ప్రతి బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తూ ముందుకు సాగుతున్న ఆమె అంకితభావం ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తోందని అభిమానులు అభిప్రాయపడు తున్నారు. 'రాకా' చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా, ఇందులో దీపిక పాత్ర కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన

### ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కమిటీ కుర్రోళ్లు' ఎంపిక

### విజువల్ వండర్ 'కల్కి 2898 ఏడీ'కి రెండు కేటగిరీల్లో అవార్డులు

**న్యూఢిల్లీ, జూలై 18:** 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు చిత్రాలు అదరగొట్టాయి. 2024 సంవత్సరానికి గానూ వివిధ కేటగిరీల్లో పలు తెలుగు చిత్రాలకు అవార్డులు దక్కాయి. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కమిటీ కుర్రోళ్ళు' ఎంపికైంది. అంతేకాదు, ఉత్తమ మేకప్ విభాగంలోనూ అవార్డు వరించింది. కొత్త నటులతో దర్శకుడు యదువంశీ రూపొందించి ఈ చిత్రానికి మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా వ్యవహరించడం విశేషం. బాక్సాఫీస్‌తో పాటు ఓటీటీలోనూ అదరగొట్టిన ఈ మూవీ ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డుల్లో జాతీయ సమైక్యత, మతసామరస్యం, అణగారిన వర్గాల సామాజిక అభ్యున్నతికి ఉద్దేశించిన చిత్రంగా వివిధ విభాగాల్లో మెరిసింది. ఇక నాగ్ అశ్విన్ విజువల్ వండర్ 'కల్కి 2898 ఏడీ'కి రెండు కేటగిరీల్లో అవార్డులను దక్కించుకుంది. అద్భుతమైన సెట్స్, విజువల్స్‌తో అలరించినందుకు ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ అవార్డుతో పాటు, ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. 'ఎంత గొప్పగా ఆడావు అన్నది ముఖ్యం కాదు.. ఎప్పుడు ఆపావన్నదే ముఖ్యం, 'ఒక్క రోజులో ఒక అరగంట నాకు నచ్చినట్టు గడవలేదు. దానికి జీవితాంతం ఏడుస్తూ కూర్చోలేను కదా' వంటి సంభాషణలతో అలరించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. ఇలాంటి అద్భుతమైన సంభాషణలను రాసి జీవిత సత్యాలెన్నో చెప్పిన




దర్శకుడు వెంకీ అట్లూరి ఉత్తమ రచయితగా జాతీయ అవార్డు దక్కింది. మాస్‌నే కాదు, బాక్సాఫీస్‌ను ఓ ఊపు ఊపేసిన చిత్రం 'పుష్ప2'. ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ మూవీని ఆద్యంతం అలరించేలా తీర్చిదిద్దిన దర్శకుడు సుకుమార్ ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత కేటగిరిలో అవార్డుకు ఎంపిక కాగా, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్‌గా దీపాలి నూర్, సీతల్ శర్మలకు అవార్డు దక్కింది. చిన్న చిత్రం కాదు.. ప్రతి ఒక్కరి మనుసుల్ని హత్తుకునేంత పెద్ద చిత్రమనించింది '35- చిన్న కథ కాదు'. ఇప్పుడు జాతీయ అవార్డుల్లో ఉత్తమ బాలల చిత్రంతో పాటు, ఉత్తమ బాల నటుడిగా అరుణ్‌దేవ్ పోతుల అవార్డుకు ఎంపికయ్యారు.



**CHANGE OF NAME**

**I SIRAZ BEGUM,** W /O MOHAMMED OSMAN (OLD NAME) H.No. 5-2-107, OSMANPURA STREET, JAGTIAL DIST, JAGTIAL State: Telangana Pin: 505327, I have Changed My Name to **SIRAJ UNNISSA BEGUM W/O MOHAMMED OSMAN** (New Name) and hence forth be known as **SIRAJ UNNISSA BEGUM w/o MOHAMMED OSMAN**

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com